సామాజిక, రాజకీయ పక్ష పత్రిక

25 జూన్
2026

# జనసందేశ్

జాతీయ చైతన్య జ్వాల



## యోగా అందరినీ అనుసంధానిస్తుంది... ఐకమత్యంగా ఉంచుతుంది




## మోదీ 12 ఏళ్ల పాలనలో పెరిగిన భారత ప్రతిష్ట




విశేష్ సంపర్క్ అభియాన్‌లో భాగంగా ప్రముఖులకు 12 ఏళ్ల మోదీ ప్రభుత్వ విజయాల బుక్ లెట్లు పంపిణీ చేసిన బిజెపి నాయకులు










# జనసందేశ్

జాతీయ చైతన్య జ్వాల

సంపుటి : 36 సంచిక : 15 25 జూన్ 2026

Editor & Publisher : **Manthri Srinivasulu**
on behalf od Bharatiya Janata Party
Published at: Dr. Shyam Prasad Mukarjee Bhavan,
Opp: Exhibition Grounds, Nampally, Hyderabad - 500 001.



Email:
janasandeshmag@gmail.com
janasandeshmag@yahoo.co.in
Web Site: www.bjpjanasandesh.org




12 **యోగా అందరినీ అనుసంధానిస్తుంది... ఐకమత్యంగా ఉంచుతుంది: మోదీ**

జూన్ 21న 12వ అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా కోల్‌కతాలోని రెడ్ రోడ్ వద్ద జాతీయ వేడుకలను ప్రధానమంత్రి నరేంద్ర మోదీ...

# విషయ సూచిక


శ్యామా ప్రసాద్ కలలను సాకారం చేస్తున్న మోదీ ప్రభుత్వం ... 05

సంతుష్టీకరణ రాజకీయాలను వ్యతిరేకించిన ముఖర్జీ ... 06

అంగరంగ వైభవంగా అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలు ... 14

కాంగ్రెస్ పాలకులకు 'లంకెబిందె'లా సింగరేణి ... 17

ముఖర్జీకి ఘన నివాళి పశ్చిమ బెంగాల్ విజయం ... 19

మెట్రోరైల్ ఫేజ్-2లో రేవంత్ ప్రభుత్వ అలసత్వం బహిర్గతం ... 21

మీనాక్షీ నటరాజన్‌కు వెన్నుపోటుపై తెలంగాణ కాంగ్రెస్ అతలాకుతలం ... 22

ఘనంగా "నమో జెన్Z కాన్‌క్లేవ్" ... 24

బస్తర్‌లో 12 ఏళ్ల శాంతి, పురోగతుల ప్రస్థానం ... 25

సరికొత్త పాలనా సంస్కరణలకు తెరతీసిన మోదీ శకం ... 27

మాలో ఒక్క మంత్రి మీదైనా అవినీతి ఆరోపణలు వచ్చాయా? ... 29

మోర్చాల జిల్లా అధ్యక్షులు వీరే! ... 33




07 **మోదీ 12 ఏళ్ల పాలనలో పెరిగిన భారత ప్రతిష్ట**

గడిచిన 12 ఏళ్ల ప్రధాని నరేంద్ర మోదీ సుపరిపాలనలో భారతదేశం అంతర్జాతీయ వేదికలపై తిరుగులేని గౌరవాన్ని, శక్తివంతమైన గుర్తింపును సాధించిందని కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ కొనియాడారు. జూన్ 12న సికింద్రాబాద్‌లో నిర్వహించిన 'మేధావుల సమ్మేళనం'లో...

# సంపాదకీయం

## 'ఎస్ఐఆర్'పై కాంగ్రెస్ పస లేని విమర్శలు

స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ అనేది ఎన్నికల సంఘం చేపట్టే ఓటర్ల జాబితా ప్రక్షాళనకు సంబంధించిన రాజ్యాంగ ప్రక్రియ. ఇది ఒక పార్టీకి, ప్రభుత్వానికి సంబంధించిన వ్యవహారం కాదు. కాంగ్రెస్ లేదా బిజెపి ఏ పార్టీ అధికారంలో ఉన్నప్పటికీ.. ఓటర్ల జాబితా పారదర్శకత, అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించడం కోసం ఈసీ ఎప్పటికప్పుడు ప్రక్షాళన చేపడుతుంది. ఇందులో భాగంగా ఇంటింటి సర్వేలు నిర్వహిస్తుంది. అయితే, రాజకీయ పార్టీలు తమ స్వప్రయోజనాలు, భవిష్యత్తు ఎన్నికల సమీకరణాల కోసం ఈ ప్రక్రియను వివాదాస్పదం చేయడం దురదృష్టకరం.

అవినీతి, అక్రమాలకు పర్యాయపదంగా మారిన కాంగ్రెస్ పై ప్రజల్లో ఆగ్రహం చల్లారడం లేదు. కేంద్రంలో, అనేక రాష్ట్రాల్లో అధికారానికి దూరమైనా కాంగ్రెస్ తమ ఓటమికి కారణాన్ని గుర్తించలేకపోతుంది. తమ నాయకత్వం వైఫల్యాలను అంగీకరించలేక ఓటమికి కారణాలు వెతకడం కాంగ్రెస్ కు అలవాటుగా మారింది. సాధారణంగా ఒక రాజకీయ పార్టీ తమ పరాజయానికి అసలు కారణాలను విశ్లేషించి, ఆ ఫలితం పునరావృతం కాకుండా తగిన చర్యలు తీసుకోవాలి. కానీ, కాంగ్రెస్ తమ నాయకత్వానికి మరీ ముఖ్యంగా పప్పుగా ప్రజలు చీదరించుకుంటున్న యువరాజు అసమర్థతను కప్పిపుచ్చుకునేందుకు ఈవీఎంలు టాంపర్ అయ్యాయని, ఎస్ఐఆర్ ను దుర్వినియోగం చేస్తున్నారని సాకులు వెతుకుతూ కాలం గడుపుతోంది.

ఈవీఎంలను తీసుకొచ్చింది కాంగ్రెస్ ప్రభుత్వమే. ఒకవేళ ఈవీఎంలను టాంపర్ చేయగలిగితే అందుకు మొదటి అవకాశం కాంగ్రెస్ కే ఉంటుంది. అప్పుడు కాంగ్రెస్ ఈవీఎంలను టాంపర్ చేసి, వరుసగా అధికారాన్ని నిలబెట్టుకొని ఉండేది. కానీ, కాంగ్రెస్ ఓడిపోతే మాత్రం ఈవీఎంలు టాంపర్ అయ్యాయంటూ తమను తాము మభ్యపెట్టుకుంటోంది. అదే కాంగ్రెస్ గెలిస్తే మాత్రం ప్రజలు తమకు అనుకూలంగా తీర్పు ఇచ్చారంటారు. అప్పుడు ఈవీఎంలు టాంపర్ అయ్యాయనే విషయం గుర్తుకురాదు. ఇప్పుడు ఆ కోవలోనే కాంగ్రెస్ ఎస్ఐఆర్ పై విమర్శలు గుప్పిస్తోంది. ఎస్ఐఆర్ ను బిజెపి దుర్వినియోగం చేస్తుందని కాంగ్రెస్ ఆరోపిస్తోంది. బడుగు బలహీన వర్గాలు, మైనారిటీల ఓట్లు, లౌకిక ఓట్లను ఉద్దేశపూర్వకంగా తొలగిస్తోందని వాదిస్తోంది. ఇవి ఫక్తు రాజకీయ ఆరోపణలు మాత్రమే. ఇందులో ఎంతమాత్రం వాస్తవం లేదు.

టీ. ఎన్. శేషన్ 1990 డిసెంబర్‌లో భారత ప్రధాన ఎన్నికల కమిషనర్ గా బాధ్యతలు చేపట్టిన తర్వాత ఎన్నికల కమిషన్ శక్తేంటో ప్రజలకు తెలిసింది. శేషన్ ఎన్నికల సంస్కరణలు, ఎన్నికల నియమావళిని కఠినంగా అమలు చేసి ఎన్నికల వ్యవస్థలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చారు. దీనిని ఓర్వలేని కాంగ్రెస్ రాజ్యాంగ సవరణతో అప్పటివరకు ఒకే ప్రధాన ఎన్నికల కమిషనర్‌తో పనిచేసిన ఎన్నికల కమిషన్‌ను ముగ్గురు సభ్యుల సంస్థగా మార్చింది. ప్రధాన ఎన్నికల కమిషనర్‌తో పాటు ఇద్దరు ఎన్నికల కమిషనర్లను నియమించింది. కాంగ్రెస్ హయాంలో నియమితులైన ప్రధాన ఎన్నికల కమిషనర్ షాబుద్దీన్ యాకుబ్ ఖరేషి ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి కరోనా సోకాలంటూ సోషల్ మీడియాలో పోస్టులు పెట్టి తన పైశాచికత్వాన్ని బయటపెట్టుకున్నారు. ఇలా ఎలక్షన్ కమిషన్ ను ప్రభావితం చేసేందుకు ప్రయత్నించిన చరిత్ర ఉన్న కాంగ్రెస్ ఎస్ఐఆర్ విషయంలో బిజెపిపై ఆరోపణలు చేయడం గురివింద సామెతను జ్ఞప్తికి తెస్తోంది.

గతంలో కాంగ్రెస్ పార్టీలు అధికారంలో ఉన్నప్పుడు కూడా ఇటువంటి సవరణలు జరిగాయి. అప్పుడు ప్రతిపక్షంలో ఉన్న బిజెపి ఈ ప్రక్రియను తప్పుబట్టలేదు, విమర్శించలేదు. ఇప్పుడు బిజెపి హయాంలో ఎన్నికల సంఘం పారదర్శకంగా ఓటర్ల జాబితాలోని డూప్లికేట్, చనిపోయిన వారి ఓట్లను తొలగిస్తుంటే కాంగ్రెస్ అనవసరమైన రాజకీయ ఆరోపణలు చేస్తూ ప్రజలను తప్పదోవ పట్టిస్తోంది. కాంగ్రెస్ హయాంలో రాజ్యాంగబద్ధమైన ఎస్ఐఆర్ ప్రక్రియ ఇప్పుడు రాజ్యాంగ విరుద్ధం ఎలా అయ్యింది? ఓటుబ్యాంకు రాజకీయాలే కారణమా?

అర్హులైన ప్రతి వ్యక్తికి ఓటు హక్కు కల్పించడం ఎంత ముఖ్యమో, అనర్హుడి ఓటును తొలగించడమూ అంతే ముఖ్యం. ఓటరు జాబితా ఎంత పరిశుద్ధంగా ఉంటే ప్రజాస్వామ్యం అంత పరిపుష్టంగా ఉంటుంది. అందుకే ఎస్ఐఆర్ సమర్థంగా అమలు చేసేలా బిజెపి తమ పార్టీ నేతలకు, కార్యకర్తలకు విస్తృతంగా శిక్షణ ఇస్తోంది. జాతీయస్థాయి నుంచి గ్రామస్థాయి వరకు కార్యశాలలు నిర్వహిస్తోంది. అర్హుడైన ప్రతి వ్యక్తికి ఓటు హక్కు దక్కేలా, అనర్హుడికి తొలగించేలా బీఎల్ఏ-1, బీఎల్ఏ-2 లకు పలుమార్లు శిక్షణా కార్యక్రమాలు చేపట్టింది. చిత్తశుద్ధి ఉంటే కాంగ్రెస్ కూడా ఒక్క అర్హుడి ఓటు తొలగించకుండా, అనర్హుడికి ఓటు హక్కు దక్కకుండా తమ కింది స్థాయి కార్యకర్తలకు తగిన శిక్షణ ఇవ్వాలి. దానిని విస్మరించి కేవలం బిజెపిని, ప్రధానమంత్రి నరేంద్ర మోదీని విమర్శించాలన్న నెపంతో విమర్శిస్తే ఆ పార్టీనే ప్రజల్లో అభాసు పాలవుతుంది.

ప్రజాస్వామ్యంలో అంతిమ నిర్ణయం ప్రజలదే. అధికారంలో ఎవరు ఉండాలో ఓటు ద్వారా ప్రజలే నిర్ణయిస్తారు. ఎన్నికల్లో గెలవాలంటే రాజకీయ పార్టీలు ప్రజల నమ్మకం పొందాలి, విశ్వాసాన్ని సంపాదించాలి, సానుకూల అభిప్రాయాన్ని కూడగట్టాలి. అందుకు ప్రజల సమస్యలను అర్థం చేసుకుని, వాటికి పరిష్కారాలు చూపింపాలి. ఈ విషయాన్ని 140 సంవత్సరాల చరిత్ర ఉన్న కాంగ్రెస్ గుర్తించడం లేదు. సుపరిపాలన, పారదర్శకత, అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాలు, ప్రజలకు అందుబాటులో ఉండే నాయకత్వం ప్రజల విశ్వాసాన్ని పెంచుతాయి. అందుకే బిజెపి ప్రజల మనసు గెలుచుకుంటోంది, వరుసగా ఎన్నికల్లో గెలుస్తూ ఉంది.



# శ్యామా ప్రసాద్ కలలను సాకారం చేస్తున్న మోదీ ప్రభుత్వం

ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం ఆర్టికల్ 370 రద్దు చేయడం ద్వారా డాక్టర్ శ్యామా ప్రసాద్ ముఖర్జీ కలలకు సాకారం చేశారని బిజెపి జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ వ్యాఖ్యానించారు. కశ్మీర్‌కు ప్రత్యేక హోదా కల్పించిన ఆర్టికల్ 370 రద్దు చేయడం డాక్టర్ ముఖర్జీకి నిజమైన నివాళి అని పేర్కొన్నారు. జూన్ 23న ఢిల్లీలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో డాక్టర్ శ్యామా ప్రసాద్ ముఖర్జీ బలిదాన్ దివస్ సందర్భంగా ఆయనకు నివాళులర్పించారు. దేశ తొలి పరిశ్రమల మంత్రిగా, గొప్ప జాతీయవాదిగా, దూరదృష్టి కలిగిన నాయకుడిగా డాక్టర్ శ్యామా ప్రసాద్ ముఖర్జీ సేవలను నితిన్ నబీన్ స్మరించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ సమగ్రత, జాతీయవాద భావజాల పరిరక్షణ కోసం ఆయన చేసిన త్యాగం చిరస్మరణీయమని అన్నారు. పశ్చిమ బెంగాల్, అస్సాం, పంజాబ్ వంటి సరిహద్దు రాష్ట్రాల భౌగోళిక సమగ్రత, జనాభా స్వరూపాన్ని కాపాడేందుకు డాక్టర్ ముఖర్జీ చేసిన పోరాటం నేటికీ ఆదర్శమేనని నితిన్ నబీన్ అన్నారు. పశ్చిమ బెంగాల్‌లో బిజెపి బలపడటం ఆయన ఆలోచనలకు లభిస్తున్న మద్దతుకు నిదర్శనమని వ్యాఖ్యానించారు.

1951లో డాక్టర్ శ్యామా ప్రసాద్ ముఖర్జీ జాతీయవాద భావజాలాన్ని ముందుకు తీసుకెళ్లేందుకు జనసంఘ్‌ను స్థాపించారని గుర్తుచేశారు. నేడు ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో 14 కోట్లకు పైగా బిజెపి కార్యకర్తలు అదే జాతీయవాద సిద్ధాంతంతో దేశాభివృద్ధికి కృషి చేస్తున్నారని తెలిపారు. డాక్టర్ శ్యామా ప్రసాద్ ముఖర్జీ కలలుగన్న భారతాన్ని నరేంద్ర మోదీ సాకారం చేస్తున్నారని నితిన్ నబీన్ పేర్కొన్నారు. ఆయన ఆశయాలు, లక్ష్యాలను నెరవేర్చేందుకు బిజెపి కార్యకర్తలు, మోదీ ప్రభుత్వం చేస్తున్న కృషే డాక్టర్ ముఖర్జీకి నిజమైన నివాళి అని అన్నారు.

ఈ కార్యక్రమంలో బిజెపి జాతీయ ఉపాధ్యక్షురాలు, రాజస్థాన్ మాజీ ముఖ్యమంత్రి వసుంధరా రాజే సింధియా, జాతీయ సంస్థాగత ప్రధాన కార్యదర్శి బి.ఎల్. సంతోష్, జాతీయ ప్రధాన కార్యదర్శులు అరుణ్ సింగ్, దుష్యంత్ గౌతమ్, లోక్‌సభ సభ్యుడు, బిజెపి జాతీయ మీడియా విభాగం అధిపతి అనిల్ బలూనీ తదితరులు పాల్గొన్నారు.

**–జనసందేశ్ ప్రతినిధి**





# సంతుష్టీకరణ రాజకీయాలను వ్యతిరేకించిన ముఖర్జీ

భారతదేశంలో నేడు పశ్చిమ బెంగాల్ అంతర్భాగంగా ఉందంటే, దానికి డాక్టర్ శ్యామా ప్రసాద్ ముఖర్జీ పోషించిన దృఢమైన, చారిత్రాత్మక పాత్రే కారణమని బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు తెలిపారు. హిందువుల రక్షణ కోసం ఆయన నిర్భయంగా పోరాడారని అన్నారు. విభజన, ఓటు బ్యాంకు, సంతుష్టీకరణ రాజకీయాలకు వ్యతిరేకంగా బలంగా నిలబడ్డారని స్పష్టం చేశారు. భారతీయ జనసంఘ్ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ శ్యామా ప్రసాద్ ముఖర్జీ బలిదాన్ దివస్ (వర్ధంతి) సందర్భంగా జూన్ 23న హైదరాబాద్‌లోని బిజెపి తెలంగాణ రాష్ట్ర కార్యాలయంలో పార్టీ నేతలు ఆయనకు ఘన నివాళులు అర్పించారు. ఎన్. రాంచందర్ రావుతో పాటు మహారాష్ట్ర మాజీ గవర్నర్ సీహెచ్. విద్యాసాగర్ రావు, హర్యానా మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ తదితర నాయకులు డా. శ్యామా ప్రసాద్ ముఖర్జీ చిత్రపటానికి పూలమాలలు వేసి అంజలి ఘటించారు. దేశానికి చేసిన సేవలను, త్యాగాలను స్మరించుకున్నారు.

ఈ సందర్భంగా ఎన్.రాంచందర్ రావు మాట్లాడుతూ... డాక్టర్ శ్యామా ప్రసాద్ ముఖర్జీ జీవితం దేశం కోసం చేసిన త్యాగానికి, ధైర్యానికి, రాజీలేని నిబద్ధతకు ఒక నిదర్శనమని కొనియాడారు. 1950ల నాటి కాశ్మీర్, హైదరాబాద్ పరిస్థితులను పోలుస్తూ నాడు అద్వానీ సూచన మేరకు తెలంగాణ బిజెపి రాష్ట్ర కార్యాలయ భవనానికి డాక్టర్ శ్యామాప్రసాద్ ముఖర్జీ పేరు పెట్టారని ఈ సందర్భంగా గుర్తుచేశారు. నాటి రోజుల్లో హైదరాబాద్ నిజాం పాలనలో ఉండగా, జమ్మూ కాశ్మీర్ కూడా భారతదేశంతో పూర్తి విలీనం అయ్యే విషయంలో సవాళ్లను ఎదుర్కొందని పేర్కొన్నారు. హైదరాబాద్, ఇతర సంస్థానాలను భారతదేశంలో విలీనం చేయడంలో సర్దార్ వల్లభభాయ్ పటేల్ ఎలాగైతే నిర్ణయాత్మక పాత్ర పోషించారో, అదేవిధంగా జమ్మూ కాశ్మీర్‌ను భారతదేశంలో పూర్తి స్థాయిలో అంతర్భాగం చేయడం కోసం డాక్టర్ శ్యామా ప్రసాద్ ముఖర్జీ తన ప్రాణాలనే త్యాగం చేశారని అన్నారు.

డాక్టర్ ముఖర్జీ గొప్ప మేధావి, పరిపాలనదక్షుడు అని, అత్యంత పిన్న వయస్సులోనే కలకత్తా విశ్వవిద్యాలయానికి వైస్ ఛాన్సలర్‌గా పనిచేశారని గుర్తుచేశారు. ఎన్నో కీలక పదవుల్లో ఉన్నప్పటికీ, వ్యక్తిగత అధికారం లేదా పదవుల కంటే కూడా ఎల్లప్పుడూ దేశానికే ప్రథమ ప్రాధాన్యత ఇచ్చారని గుర్తుచేశారు. జాతీయ ప్రయోజనాల విషయంలో కాంగ్రెస్ అవలంబిస్తున్న సంతుష్టీకరణ, రాజీ ధోరణిని అంగీకరించలేక డాక్టర్ శ్యామా ప్రసాద్ ముఖర్జీ నెహ్రూ క్యాబినెట్ నుండి రాజీనామా చేశారని గుర్తుచేశారు. ఆయన జీవితం బిజెపి కార్యకర్తలకు నేషన్ ఫస్ట్ (దేశానికే తొలి ప్రాధాన్యం) అనే మార్గదర్శక మంత్రాన్ని అందించిందని అన్నారు. దశాబ్దాలుగా కాంగ్రెస్, కమ్యూనిస్టు, టీఎంసీ పార్టీలు బెంగాల్‌ను అభివృద్ధికి దూరం చేశాయని, అయితే నేడు బిజెపి నాయకత్వంలో బెంగాల్‌లో డాక్టర్ శ్యామాప్రసాద్ ముఖర్జీ ఆశయాలను పునరుద్ధరించడం జరుగుతోందని పేర్కొన్నారు. తెలంగాణలోని ప్రతి బిజెపి కార్యకర్త బెంగాల్‌లోని బిజెపి విజయాల నుండి స్ఫూర్తి పొంది, దానిని తెలంగాణలోనూ పునరావృతం చేయాలని పిలుపునిచ్చారు.

–జనసందేశ్ ప్రతినిధి

# మోదీ 12 ఏళ్ల పాలనలో పెరిగిన భారత ప్రతిష్ట



## మేధావుల సమ్మేళనంలో రాజ్‌నాథ్ సింగ్

● భువన

గడిచిన 12 ఏళ్ల ప్రధాని నరేంద్ర మోదీ సుపరిపాలనలో భారతదేశం అంతర్జాతీయ వేదికలపై తిరుగులేని గౌరవాన్ని, శక్తివంతమైన గుర్తింపును సాధించిందని కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ కొనియాడారు. జూన్ 12న సికింద్రాబాద్‌లో నిర్వహించిన 'మేధావుల సమ్మేళనం'లో ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. "12 ఏళ్ల సుపరిపాలన – అభివృద్ధి – ప్రజా సంక్షేమం" అనే అంశంపై జరిగిన ఈ సదస్సులో ఆయన మాట్లాడుతూ.. దేశంలో, అంతర్జాతీయంగా భారతదేశం సాధించిన అపూర్వ ప్రగతిని వివరించారు. ఈ వేదికపై మేధావులను ఉద్దేశించి మాట్లాడటం తనకు ఎంతో సంతోషాన్ని ఇస్తోందని రక్షణ మంత్రి పేర్కొన్నారు. తన ప్రసంగం ప్రారంభంలో రాజ్‌నాథ్ సింగ్ భారతదేశ ఉక్కు మనిషి సర్దార్ వల్లభభాయ్ పటేల్ కు ఘన నివాళులు అర్పించారు. హైదరాబాద్‌ను భారతదేశంలో అంతర్భాగంగా మార్చి, దేశ ఐక్యతను, సమగ్రతను కాపాడటంలో పటేల్ చేసిన అసాధారణమైన కృషిని ఈ సందర్భంగా ఆయన స్మరించుకున్నారు.

ఈ మేధావుల సదస్సులో రాజ్‌నాథ్ సింగ్ మాట్లాడుతూ.. హైదరాబాద్‌కు రావడం ఎల్లప్పుడూ సంతోషాన్నిస్తుందని, ఇక్కడి భారీ జనసందోహం చూస్తుంటే దేశ ప్రజల ఆశీస్సులు భారతీయ జనతా పార్టీకే ఉన్నాయని స్పష్టమవుతోందని అన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ ప్రజాస్వామ్యబద్ధంగా, ప్రజలచే ఎన్నికై, అత్యంత సుదీర్ఘకాలం దేశానికి సేవ చేసిన ప్రధానమంత్రిగా రికార్డు సృష్టించారని, ఇది సామాన్యమైన విజయం కాదని, ప్రజల అచంచల విశ్వాసానికి ప్రతీక అని కొనియాడారు. అంతర్జాతీయంగా అత్యంత ప్రజాదరణ పొందిన నాయకుడిగా మోదీ గుర్తింపు పొందారని పేర్కొంటూ, మోదీ నేతృత్వంలోని గడిచిన 12 సంవత్సరాల కాలం దేశ ప్రగతిలో, సంస్కరణల పరంగా చారిత్రాత్మకమైనవని, 2047 నాటికి భారతదేశం ఖచ్చితంగా 'వికసిత భారత్'గా మారి తీరుతుందని ధీమా వ్యక్తం చేశారు.

### విశ్వసనీయతే బిజెపి బలం

రాజకీయాల్లో నాయకుడికి లేదా పార్టీకి అతిపెద్ద పెట్టుబడి విశ్వసనీయత (క్రెడిబిలిటీ) అని, చెప్పేదానికి చేసేదానికి తేడా ఉన్నప్పుడు విశ్వసనీయత సంక్షోభం ఏర్పడుతుందని రాజ్‌నాథ్ సింగ్ అభిప్రాయపడ్డారు. కాంగ్రెస్ హయాంలో ఈ సంక్షోభం ఉండేదని, కానీ బిజెపి ఇచ్చిన ప్రతి మాటను నిలబెట్టుకుంటూ ప్రజల్లో నమ్మకాన్ని పెంచిందని చెప్పారు. పశ్చిమ బెంగాల్‌లో ప్రజల నమ్మకాన్ని వమ్ము చేసిన వారికి అక్కడి ప్రజలు బుద్ధి చెప్పారని, అక్కడ బిజెపి స్పష్టమైన మెజారిటీతో ప్రభుత్వం ఏర్పాటు చేయడంలో విజయవంతమైందని గుర్తుచేశారు. ఒక నమ్మకమైన నాయకుడికి ఉండాల్సిన నాలుగు గుణాలు—



చిత్తశుద్ధి, నిజాయితీ, పని చేసే సామర్థ్యం, ఇచ్చిన హామీలను ఫలితాలుగా మార్చే నైపుణ్యం—ప్రధాని మోదీలో సంపూర్ణంగా ఉన్నాయని స్పష్టం చేశారు. మోదీ ప్రధాని కాగానే "నా ఖావూంగా, నా కిసీకో ఖానే దూంగా" అని స్పష్టం చేశారని, మంత్రి అయినా, సామాన్యుడైనా అవినీతిని సహించేది లేదని నిరూపించారని చెప్పారు. కాంగ్రెస్ పాలనలో 2G స్కామ్, కామన్వెల్త్ స్కామ్, ఆగస్టా వెస్ట్‌ల్యాండ్ హెలికాప్టర్ స్కామ్ వంటి లక్షల కోట్ల అవినీతి వల్ల దేశ ప్రతిష్ట మసకబారిందని, సైనికుల భద్రతను కూడా పణంగా పెట్టారని విమర్శించారు. తాము అధికారంలోకి వచ్చాక రక్షణ బడ్జెట్‌ను రూ.2.5 లక్షల కోట్ల నుండి దాదాపు రూ.8 లక్షల కోట్లకు పెంచామని, రక్షణ రంగానికి కేటాయించే ప్రతి పైసా అత్యంత పారదర్శకంగా, దేశ భద్రత కోసమే ఖర్చవుతోందని రక్షణ మంత్రిగా హామీ ఇచ్చారు.

బిజెపి వచ్చే ఎన్నికల కోసం కాకుండా, రాబోయే తరం భవిష్యత్తు కోసం ఆలోచిస్తుందని రాజ్‌నాథ్ సింగ్ అన్నారు. తాము ఇచ్చిన ప్రతి మాటను నిలబెట్టుకున్నామని పేర్కొంటూ, అయోధ్య గడ్డపైనే భవ్య రామమందిరాన్ని నిర్మిస్తామని చెప్పి చేసి చూపించామన్నారు. దేశంలోకి వచ్చే అక్రమ చొరబాటుదారులను సరిహద్దుల వెలుపలికి పంపుతామని చెప్పామని, బిజెపి అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో ఆ ప్రక్రియ వేగంగా జరుగుతోందని, పశ్చిమ బెంగాల్‌లో కూడా చొరబాటుదారులను బయటకు పంపే పని వేగవంతమైందని తెలిపారు. ముస్లిం మహిళల జీవితాల్లో శాపంగా మారిన ట్రిపుల్ తలాక్ సామాజిక దురాచారాన్ని చట్టబద్ధంగా రద్దు చేశామని, వక్ఫ్ చట్టాల్లో అవసరమైన సంస్కరణలను విజయవంతంగా తీసుకువచ్చామని చెప్పారు. కొత్త పార్లమెంట్ భవనంలో చట్టసభల్లో మహిళలకు 33% రిజర్వేషన్ కల్పించే చారిత్రాత్మక బిల్లును తీసుకువచ్చామని, మహిళలకు పూర్తి భాగస్వామ్యం, హక్కులు దక్కే వరకు తాము విశ్రమించబోమని, ఇది మోదీ ప్రభుత్వ గ్యారెంటీ అని స్పష్టం చేశారు. దేశంలో సమయం, వృథా ఖర్చులను తగ్గించడానికి లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికలను ఒకేసారి నిర్వహించాలన్నదే (వన్ నేషన్ – వన్ ఎలక్షన్) మా ఆలోచన అని, అందరినీ విశ్వాసంలోకి తీసుకుని ఈ పనిని ఖచ్చితంగా చేసి తీరుతామని ఆయన స్పష్టం చేశారు. గతంలో చర్చల ద్వారా సమస్యలను పరిష్కరించాలని చూసినా, అవతలి పక్షం విననప్పుడు బలం ఉపయోగించి సంస్థానాలను విలీనం చేసిన సర్దార్ పటేల్ విధానాన్నే తమ ప్రభుత్వం అనుసరిస్తోందని, మనపై దాడి చేసే వారికి వారి భాషలోనే సమాధానం చెబుతామని హెచ్చరించారు. గతంలో ఉగ్రవాద దాడులు జరిగినప్పుడు సర్జికల్ స్ట్రైక్స్ ద్వారా బుద్ధి చెప్పామని, అలాగే 'ఆపరేషన్ సింధూర్' ద్వారా శత్రువులకు గట్టి సందేశం ఇచ్చామని పేర్కొంటూ, మానవత్వానికి శత్రువులైన వారికి సింధు నది నీటిని ఇచ్చే ప్రసక్తే లేదని, పాకిస్తాన్ వైఖరి మారనంత వరకు కఠినంగానే ఉంటామని స్పష్టం చేశారు.

### విశ్వబంధుగా భారత్

గడిచిన 12 ఏళ్లలో భారతదేశం ప్రపంచానికి ఒక ఆపద్బాంధవుడిగా, విశ్వబంధువుగా నిలిచిందని రక్షణ మంత్రి అన్నారు. 'వసుధైక కుటుంబకం' అనే సందేశాన్ని కేవలం మాటల్లో కాకుండా చేతల్లో చూపిన దేశం భారతదేశం అని, కోవిడ్ సంక్షోభ సమయంలో ప్రపంచవ్యాప్తంగా అవసరమైన వ్యాక్సిన్లలో 60% మన దేశంలోనే తయారయ్యాయని, 'వ్యాక్సిన్ మైత్రి' ద్వారా 100కు పైగా దేశాలకు 30 కోట్లకు పైగా కోవిడ్ వ్యాక్సిన్లను పంపిణీ చేశామని చెప్పారు. భారతదేశం దగ్గర ప్రపంచాన్ని రక్షించే వ్యాక్సిన్ ఎంత ఉందో, శత్రువులను తుత్తునియలు చేసే 'బ్రహ్మోస్' మిసైల్ కూడా అంతకంటే శక్తివంతంగా ఉందని హెచ్చరించారు. ప్రధాని మోదీ పనితీరును, దేశం పట్ల ఆయనకున్న ప్రేమను వివరిస్తూ, 2022లో మోదీ మాతృమూర్తి స్వర్గస్తులైనప్పుడు, ఆ బాధాకరమైన రోజున కూడా ఆయన తన తల్లి అంత్యక్రియలు ముగించుకున్న వెంటనే దేశ సేవలో నిమగ్నమయ్యారని గుర్తు చేశారు. ముందే నిశ్చయమైన నేషనల్ గంగా కౌన్సిల్ సమావేశంలో పాల్గొనడమే కాకుండా, వందేభారత్ రైలును కూడా ప్రారంభించారని చెప్పారు. ఏ ఒక్క మంత్రి కూడా తన తల్లి మరణం కారణంగా అధికారిక కార్యక్రమాలను


ఎల్లవేళలా ఉల్లాసంగా ఉండగలగడమే అసలైన జ్ఞానానికి చిహ్నం: ఠాగూర్

రద్దు చేసుకోవద్దని మోదీ కోరారని, "ప్రజల సేవ కోసమే నువ్వు వెళ్లావు, ప్రజల పనులే నీ ప్రథమ కర్తవ్యం కావాలి" అని వారి అమ్మ నేర్పిన సంస్కారమే మోదీని నడిపిస్తోందని శ్లాఘించారు. తన తల్లి చనిపోయిన రోజు సహా ఒక్క రోజు కూడా సెలవు తీసుకోని వ్యక్తి ఈ దేశాన్ని, మాతృభూమిని ఎంతగా ప్రేమిస్తున్నారో అర్థం చేసుకోవచ్చన్నారు.

### నక్సలిజం ఇక చరిత్ర

దశాబ్దాలుగా మన భద్రతా దళాల్లో, సామాన్య ప్రజల్లో రక్తపాతాన్ని సృష్టించిన నక్సలిజాన్ని మోదీ నాయకత్వంలో భారతదేశ గడ్డపై నుండి దాదాపు తుడిచిపెట్టేశామని రక్షణ మంత్రి సగర్వంగా ప్రకటించారు. గతంలో తుపాకీ శబ్దాలు మోగిన ప్రాంతాల్లో ఈరోజు స్కూల్ బెల్స్ మోగుతున్నాయని, రోడ్లు, అభివృద్ధి వేగంగా చేరుతున్నాయని చెప్పారు. దేశ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేస్తూ 'వన్ నేషన్, వన్ మార్కెట్, వన్ టాక్స్' విధానంతో జీఎస్టీని విజయవంతంగా అమలు చేశామని, దీనివల్ల ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ పెరిగిందని అన్నారు. శ్రామికుల సామాజిక భద్రత, ఆదాయం పెంచేందుకు నాలుగు లేబర్ కోడ్‌లను తెచ్చామని, అలాగే వలస పాలన నాటి పాత చట్టాల స్థానంలో దేశ పౌరుల హక్కులను వేగంగా కాపాడేలా కొత్త న్యాయ చట్టాలను తీసుకువచ్చామని తెలిపారు. జమ్మూ కాశ్మీర్‌లో ఆర్టికల్ 370ని ఎవరూ తొలగించలేరన్న కాంగ్రెస్ మాటలను పటాపంచలు చేస్తూ, తమ ప్రభుత్వం దానిని రద్దు చేసిందని, "ఒకే దేశంలో రెండు రాజ్యాంగాలు, ఇద్దరు ప్రధానులు, రెండు జెండాలు చెల్లవు" అన్న డాక్టర్ శ్యామాప్రసాద్ ముఖర్జీ కలని నిజం చేశామని చెప్పారు. గతంలో రాళ్లు రువ్వడం, ఉగ్రవాదంతో వార్తల్లో నిలిచిన కాశ్మీర్ ఈరోజు పర్యాటకం, పెట్టుబడులు, ఉపాధితో కళకళలాడుతోందని, లాల్ చౌక్‌లో త్రివర్ణ పతాకం ఎగురుతోందని, అక్కడ జన్మాష్టమి వేడుకలతో పాటు మొహర్రం ఊరేగింపులు కూడా శాంతియుతంగా జరుగుతున్నాయని, తాము కుల, మతాల ఆధారంగా వివక్ష చూపబోమని, ఇన్సాఫ్ (న్యాయం), మానవత్వాల రాజకీయమే చేస్తామని స్పష్టం చేశారు.

### భారత్ గడ్డపైనే తయారీ

2014కు ముందు దేశంలో నిరాశ నిండి ఉండేదని, విదేశీ పెట్టుబడులు పెట్టడానికి ఎవరూ ముందుకు రాలేదని, కానీ నేడు ప్రపంచ దేశాలన్నీ భారత్‌తో వాణిజ్య సంబంధాల కోసం పోటీ పడుతున్నాయని రక్షణ మంత్రి తెలిపారు. గత 12 ఏళ్లలో 38 దేశాలు భారత్‌తో కొత్త వాణిజ్య ఒప్పందాలు చేసుకున్నాయని పేర్కొంటూ, 'మేక్ ఇన్ ఇండియా' విజయాలను వివరించారు. భారతదేశానికి ఏటా 19 బిలియన్ల సెమీకండక్టర్ చిప్స్ అవసరమవుతాయని, గతంలో 1960లలో మరియు 2004–05లో కాంగ్రెస్ ప్రభుత్వం పర్మిషన్లు ఇవ్వకుండా తాత్సార్యం చేయడం వల్ల సదరు కంపెనీలు చైనాకు వెళ్లిపోయాయని, దేశం పెద్ద ఎత్తున ఉపాధిని కోల్పోయిందని విమర్శించారు. కానీ మోదీ రాగానే దేశీయ సెమీకండక్టర్ రంగాన్ని ప్రోత్సహించి, గత ఏడాది దేశంలోనే మొట్టమొదటి 'మేడ్ ఇన్ ఇండియా' సెమీకండక్టర్ చిప్‌ను తయారు చేసి చూపామని ప్రకటించారు. అలాగే ప్రపంచవ్యాప్తంగా అమ్ముడవుతున్న ఐఫోన్లలో 25% భారతదేశంలోనే తయారవుతున్నాయని వెల్లడించారు. 'మేక్ ఇన్ ఇండియా' ద్వారా సూది నుండి ఓడల వరకు, మొబైల్స్ నుండి మిసైల్స్ వరకు, డ్రోన్ల నుండి వ్యాక్సిన్ల వరకు అన్నీ భారత్ గడ్డపైనే తయారవుతున్నాయని, ఈ ఏడాది ఎగుమతుల లక్ష్యాన్ని 1 ట్రిలియన్ డాలర్లకు, రాబోయే ఐదేళ్లలో 2 ట్రిలియన్ డాలర్లకు పెంచడమే లక్ష్యంగా పెట్టుకున్నామని చెప్పారు. గతంలో కేవలం రూ.600 కోట్లు లేదా రూ.1000 కోట్లుగా ఉన్న రక్షణ రంగ ఎగుమతులు నేడు దాదాపు రూ.39,000 కోట్లకు చేరాయని, ప్రపంచంలోని 100కు పైగా దేశాలకు భారతదేశం రక్షణ పరికరాలను ఎగుమతి చేస్తోందని సగర్వంగా ప్రకటించారు.

గత ప్రభుత్వాల హయాంలో ధనికులు మరింత ధనికులుగా, పేదలు మరింత పేదలుగా మారారని, కానీ తమ అంత్యోదయ విధానం వల్ల గత 12 ఏళ్లలో 25 కోట్ల మంది దేశ ప్రజలను దారిద్ర రేఖకు ఎగువకు తీసుకువచ్చామని,



అంతర్జాతీయ సంస్థల నివేదికలే దీనిని స్పష్టం చేస్తున్నాయని చెప్పారు. సమానత్వం విషయంలో ప్రపంచంలో భారత్ నేడు నాల్గవ స్థానానికి చేరిందని, రాబోయే 5 నుండి 8 ఏళ్లలో భారత్ ప్రపంచంలోనే నంబర్ వన్ స్థానానికి చేరుకుంటుందని నొక్కి చెప్పారు. గతంలో బ్యాంకు ఖాతా తెరవాలంటే సిఫార్సులు, సాక్ష్యాలు కావాల్సి వచ్చేదని, మోదీ వచ్చాక 56 కోట్లకు పైగా జన్ ధన్ ఖాతాలు తెరిపించారని, ఇప్పుడు బ్యాంకే ప్రజల ఇంటి వద్దకు వస్తోందని అన్నారు. దీనివల్ల ఎలాంటి దళారీ వ్యవస్థ లేకుండా ఢిల్లీ నుండి పంపిన సొమ్ము నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లోకే చేరుతోందన్నారు. గ్రామీణ మహిళల ఆత్మగౌరవాన్ని కాపాడుతూ దేశంలో 12 కోట్లకు పైగా మరుగుదొడ్లను నిర్మించామని, 2019లో జల్ జీవన్ మిషన్ ప్రారంభించినప్పుడు కేవలం 17 శాతం ఇళ్లకు మాత్రమే సురక్షితమైన తాగునీరు అందుతుండగా, ఈరోజు ఆ సంఖ్య 82 శాతానికి చేరిందని, కోట్లాది మంది మహిళలకు నీటి కోసం మైళ్ల దూరం నడిచే కష్టం తప్పిందని పేర్కొన్నారు. పీఎం ఆవాస్ యోజన ద్వారా కోట్లాది ఇళ్లను మహిళల పేరిట రిజిస్ట్రేషన్ చేశామని, ఉజ్వల యోజన ద్వారా పొగ నుండి విముక్తి కల్పించామని, ఆయుష్మాన్ భారత్ ద్వారా రూ.5 లక్షల వరకు ఉచిత వైద్యం అందిస్తున్నామని వివరించారు. రాజులమని భావించే కాంగ్రెస్ నాయకులకు పేదరికం, గ్రామీణ బాధలు ఎప్పటికీ అర్థం కావని ఎద్దేవా చేశారు.

### తెలంగాణ అభివృద్ధి కోసం

రాష్ట్రాల్లో ఏ పార్టీ అధికారంలో ఉన్నా తమ ప్రభుత్వం అభివృద్ధి విషయంలో ఎన్నడూ వివక్ష చూపలేదని, దేశ ప్రయోజనాలే తమకు ప్రథమ ప్రాధాన్యమని రాజ్‌నాథ్ సింగ్ స్పష్టం చేశారు. తెలంగాణకు మోదీ ప్రభుత్వం చేసిన కేటాయింపులను ఆయన గణాంకాలతో వివరిస్తూ, గతంలో




ఉమ్మడి రాష్ట్రంలో రైల్వే బడ్జెట్ రూ.1000 కోట్ల కంటే తక్కువగా ఉండేదని, కానీ ఈరోజు కేవలం తెలంగాణ రైల్వే బడ్జెట్ కోసమే దాదాపు రూ.5,000 నుండి రూ.5,500 కోట్లు కేటాయించామని చెప్పారు. తెలంగాణలో రూ.32,000 కోట్ల విలువైన రైల్వే ప్రాజెక్టులు నడుస్తున్నాయని, ప్రస్తుతం 5 వందేభారత్ రైళ్లు, 6 అమృత్ భారత్ రైళ్లు విజయవంతంగా నడుస్తున్నాయని తెలిపారు. గత నెలలోనే ప్రధాని మోదీ తెలంగాణలో రూ.1700 కోట్ల వ్యయంతో పీఎం మిత్రా టెక్స్‌టైల్ పార్క్ ను ప్రారంభించారని, ఇది తెలంగాణలో భారీగా ఉపాధి అవకాశాలను మెరుగుపరుస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. మల్కాజ్‌గిరిలో ఇండియన్ ఆయిల్ కొత్త టెర్మినల్ ప్రారంభం ద్వారా తెలంగాణ ఇంధన అవసరాలు తీరనున్నాయని చెప్పారు. తమ ప్రభుత్వం ఎల్లప్పుడూ ప్రజా సేవకే అంకితమై ఉంటుందని, దేశ ప్రయోజనాలే పరమావధిగా పనిచేస్తుందని రాజ్‌నాథ్ సింగ్ స్పష్టం చేశారు. దేశాన్ని మరింత శక్తివంతంగా మార్చేందుకు, వికసిత భారత్ నిర్మాణంలో మోదీ నాయకత్వానికి, భారతీయ జనతా పార్టీకి తెలంగాణ ప్రజల, మేధావుల సంపూర్ణ ఆశీస్సులు, మద్దతు ఉండాలని కోరారు.

### సమర్థ నాయకత్వం మన అదృష్టం: ఎన్. రాంచందర్ రావు

సర్జికల్ స్ట్రైక్స్, ఆపరేషన్ సిందూర్ వంటి సాహసోపేత చర్యలతో భారత రక్షణ సామర్థ్యాన్ని ప్రపంచ వేదికపై చాటిచెప్పిన ఘనత ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వానిదేనని బిజెపి తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు పేర్కొన్నారు. దేశ భద్రత విషయంలో రాజీపడని నాయకత్వం, నిర్ణయాత్మక పాలన వల్లే భారత్ నేడు మరింత సురక్షిత దేశంగా నిలిచిందని ఆయన అన్నారు. గత 12 ఏళ్లలో మోదీ ప్రభుత్వం దేశాన్ని ఆర్థిక, వ్యూహాత్మక, భద్రతా రంగాల్లో కొత్త శిఖరాలకు తీసుకెళ్లిందని, ప్రపంచంలోనే నాలుగో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా భారత్ ఎదగడం ఆ దూరదృష్టి నాయకత్వానికి నిదర్శనమని ఆయన కొనియాడారు. మోదీ, రాజ్‌నాథ్ సింగ్ వంటి సమర్థవంతమైన నాయకత్వం లభించడం దేశ ప్రజల అదృష్టమని, వీరి దృఢమైన నిర్ణయాల వల్లే భారతదేశ రక్షణ సామర్థ్యం, జాతీయ భద్రత మరింత బలోపేతమయ్యాయని కొనియాడారు. సర్జికల్ స్ట్రైక్స్, ఆపరేషన్ సిందూర్ వంటి ధైర్యవంతమైన చర్యల ద్వారా భారత్




తన సంకల్పాన్ని, సాహసాన్ని ప్రపంచానికి చాటిచెప్పిందని, ఉగ్రవాదం సహా జాతీయ భద్రతకు ఎదురైన ప్రతి సవాల్‌కు మోదీ ప్రభుత్వం గట్టి సమాధానం ఇచ్చిందని స్పష్టం చేశారు. నేడు మోదీ నాయకత్వంలో భారత్ సురక్షితంగా, బలంగా ఉందనే పూర్తి విశ్వాసం దేశ ప్రజల్లో వ్యక్తమవుతోందని ఆయన పేర్కొన్నారు.

జాతీయ రక్షణలో మహిళా శక్తి పాత్రను ప్రస్తావిస్తూ, 'ఆపరేషన్ సిందూర్' మహిళల నేతృత్వంలోని ధైర్యసాహసాలకు గర్వకారణమైన ఉదాహరణగా నిలిచిందని రాంచందర్ రావు గుర్తుచేశారు. మోదీ నాయకత్వంలో మహిళలకు సాయుధ దళాల్లో మరిన్ని అవకాశాలు, ఉన్నత స్థానాలు లభిస్తున్నాయని, ఇది నారీ శక్తి వందన్ పట్ల కేంద్ర ప్రభుత్వ నిబద్ధతకు నిదర్శనమని పేర్కొన్నారు. గత 12 సంవత్సరాలుగా కేంద్ర ప్రభుత్వం 'జన విశ్వాస్, వికాస్, జన్ కళ్యాణ్' మంత్రంతో దేశాన్ని ముందుకు నడిపిస్తోందని, దీని ఫలితంగానే భారత్ ప్రపంచంలో నాలుగో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఎదిగి, 'వికసిత్ భారత్' లక్ష్య సాధన దిశగా ఆత్మవిశ్వాసంతో దూసుకుపోతోందని అన్నారు. ప్రపంచ సంక్షోభాలు ఎదురైనా, భారత్ అభివృద్ధి సాధించేలా ప్రధాని నరేంద్ర మోదీ ధైర్యంగా అడుగులు వేశారని, అందుకే నిరంతరాయంగా అత్యధిక కాలం ఎన్నికైన ప్రధానమంత్రిగా ఆయన చరిత్ర సృష్టించారని కొనియాడారు. ప్రస్తుత పదవీకాలం పూర్తయ్యాక కూడా ప్రజల ఆశీర్వాదంతో 2029లో మోదీ మరోసారి ప్రధానమంత్రిగా ఎన్నికై, వికసిత్ భారత్ లక్ష్యాన్ని పరిపూర్ణంగా చేసే దిశగా పాలన అందిస్తారని ఆయన బలమైన విశ్వాసం వ్యక్తంచేశారు.

### పెండింగ్ సమస్యలెన్నో పరిష్కారం: కిషన్ రెడ్డి

కేంద్రమంత్రి జి.కిషన్ రెడ్డి ప్రసంగిస్తూ.. "నరేంద్ర మోదీ ప్రభుత్వంలో గత 12 ఏళ్ల పాలనలో దేశంలో చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్న అనేక కీలక సమస్యలను పరిష్కరించారు. దేశ ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని పలు చట్టపరమైన, పరిపాలనా సంస్కరణలను అమలు చేశారు. ఆర్టికల్ 370 రద్దు, అయోధ్యలో రామాలయ నిర్మాణం, ట్రిపుల్ తలాక్ రద్దు, ఉగ్రవాద నిర్మూలనకు కఠిన చర్యలు వంటి ఎన్నో చారిత్రాత్మక నిర్ణయాలను మోదీ ప్రభుత్వ 12 సంవత్సరాల పాలనలో అమలు చేయడం జరిగింది. దేశ గౌరవం కోసం, దేశ అభివృద్ధి కోసం, ప్రజల సంక్షేమం కోసం ప్రధాని నరేంద్ర మోదీ నిరంతరం అంకితభావంతో పని చేస్తున్నారు. నరేంద్ర మోదీ ప్రధానమంత్రిగా బాధ్యతలు స్వీకరించినప్పుడు తాను "ప్రధానమంత్రి కాదు, ప్రధాన సేవకుడిని" అని చెప్పారు. గత 12 సంవత్సరాల పాలనలో ఆయన ఆ మాటలను చేతల్లో చూపించి నిరూపించారు. నీతి, నిజాయితీ, పారదర్శకతకు ప్రాధాన్యం ఇస్తూ, అవినీతి ఆరోపణలకు తావులేకుండా పరిపాలన అందిస్తున్న నాయకుడు ప్రధాని నరేంద్ర మోదీ. ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకుంటూ, దేశాన్ని అభివృద్ధి పథంలో ముందుకు నడిపిస్తున్న నాయకత్వం నరేంద్ర మోదీదే." అని అన్నారు.

బిజెపి జాతీయ ఉపాధ్యక్షురాలు, ఎంపీ డీకే అరుణ, బిజెపి శాసనమండలి పక్ష నాయకులు ఏవీఎన్ రెడ్డి, ఎంపీలు ఈటల రాజేందర్, రఘునందన్ రావు, ఎమ్మెల్యే రాకేష్ రెడ్డి, ఎమ్మెల్సీలు అంజిరెడ్డి, మల్క కొమురయ్య, బిజెపి రాష్ట్ర సంస్థాగత ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్ తివారీ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు డా. ఎన్. గౌతం రావు, వీరేందర్ గౌడ్, ఇతర నాయకులతో పాటు, నగర ప్రముఖులు, మేధావులు, మాజీ సైనికులు పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేశారు.■



# యోగా అందరినీ అనుసంధానిస్తుంది... ఐకమత్యంగా ఉంచుతుంది

**- మోదీ**

జూన్ 21న 12వ అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా కోల్‌కతాలోని రెడ్ రోడ్ వద్ద జాతీయ వేడుకలను ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రారంభించారు. వేలాది యోగా సాధకులతో కలిసి కామన్ యోగా ప్రోటోకాల్ సెషన్‌లో పాల్గొన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా ప్రపంచవ్యాప్తంగా ఉన్న ప్రజలకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఏడాదిలో పగటి సమయం ఎక్కువగా ఉండే రోజు జూన్ 21 అని, అలాగే ప్రపంచంలోని అనేక ప్రాంతాల్లో నిర్వహించే అతిపెద్ద సామూహిక వేడుకల్లో ఈ రోజు ఒకటని వివరించారు.

కోల్‌కతాలో జరిగిన ఈ కార్యక్రమంలో ప్రధానమంత్రి ప్రసంగిస్తూ ప్రపంచంలోని వివిధ ప్రాంతాల్లో యోగా చేస్తున్న దృశ్యాలు స్ఫూర్తిదాయకంగా ఉన్నాయన్నారు. "హిమాలయాల నుంచి హిందూ మహాసముద్రం వరకు, బెంగాల్, ఈశాన్య రాష్ట్రాల నుంచి పశ్చిమ ప్రాంతంలోని సౌరాష్ట్ర వరకు.. యోగా స్ఫూర్తితో దేశమంతటా నూతన శక్తి ఆవిష్కృతమవుతోంది. ఆరోగ్యం, సామరస్యం పట్ల ఉన్న ఉమ్మడి నిబద్ధతతో దేశం, ప్రపంచం ఒకదానితో ఒకటి ముడిపడినట్లుగా కనిపిస్తోంది. యోగాకున్న ఐక్యతా శక్తిని ఇది ప్రతిబింబిస్తోంది" అని మోదీ చెప్పారు.

"స్వచ్ఛత సే స్వాగత్" కార్యక్రమం ద్వారా కోల్‌కతా ప్రజలు చేపట్టిన ప్రయత్నాలను ప్రధానమంత్రి అభినందించారు. పరిశుభ్రతను కాపాడటంలో అక్కడి పౌరులు ప్రదర్శించిన అంకితభావం, శ్రమించే తత్వం, సామాజిక స్పృహ దేశ ప్రజలందరికీ స్ఫూర్తిని అందిస్తున్నాయని చెప్పారు. పశ్చిమ బెంగాల్‌కు ఉన్న విశిష్ట ఆధ్యాత్మిక, సాంస్కృతిక వారసత్వం కారణంగా ఇక్కడ నిర్వహిస్తున్న యోగా దినోత్సవం ప్రత్యేకతను సంతరించుకుందని మోదీ చెప్పారు. భగవాన్ రామకృష్ణ పరమహంస జీవించిన, ఆధ్యాత్మిక బోధన చేసిన పవిత్ర భూమి బెంగాల్ అని ఆయన గుర్తు చేసుకున్నారు. ఇక్కడి నుంచే స్వామి వివేకానంద భారతదేశ ఆధ్యాత్మిక జ్ఞానాన్ని, యోగా సంప్రదాయాలను ప్రపంచానికి పరిచయం చేశారనీ చెప్పారు. యోగ తత్వశాస్త్రం, సాధనలో పురోగతికి



మహర్షి అరబిందో, లాహిరీ మహాశయ ఇక్కడి నుంచే విశేష కృషి చేశారని తెలిపారు. గురుదేవులు రవీంద్రనాథ్ ఠాగూర్ బోధనలను ప్రస్తావిస్తూ... చుట్టూ ఉన్న ప్రపంచంతో ఏర్పడే అర్థవంతమైన అనుబంధాలతోనే నిజమైన మానవ గుర్తింపు రూపుదిద్దుకుంటుందనీ, ఈ సూత్రమే యోగాలో ముఖ్యమైన అంశమనీ ప్రధానమంత్రి అన్నారు. సమస్త జీవనమే యోగా అన్న మహర్షి అరవిందుల నమ్మకాన్ని కూడా ఆయన ఉటంకించారు. వ్యక్తి జీవితంలో యోగా భాగమైనప్పుడు, అది మానవ ఐక్యతా పునాదిని బలోపేతం చేస్తుందని తెలియజేశారు. "యోగా శారీరక వ్యాయామం మాత్రమే కాదు. దీనిని నిర్దుష్ట వయసుల వారికే పరిమితం చేయలేం. ఇది మానవ జీవితంలోని ప్రతి దశనూ సుసంపన్నం చేసే చైతన్యానికీ, ప్రాణశక్తికీ, మానసిక ప్రకాశానికీ మూలాధారం" అని మోదీ స్పష్టం చేశారు. ఈ ఏడాది అంతర్జాతీయ యోగా దినోత్సవ ఇతివృత్తమైన "ఆరోగ్యవంతమైన ఆయుష్షు కోసం యోగా" గురించి ఆయన వివరించారు. వయసు పెరుగుతున్నప్పటికీ ఆరోగ్యంగా, చురుగ్గా, ఉత్సాహంగా ఉండే ఓ మంచి మార్గాన్ని యోగా అందిస్తుందని ఆయన చెప్పారు.

ఆరోగ్యకరమైన ఆయుర్దాయం అంటే వయసు పైబడుతున్నప్పటికీ మనిషిలో ఉన్న సామర్థ్యాలు తగ్గకుండా చూసుకోవడమేనని ప్రధానమంత్రి తెలియజెప్పారు. జీవితమంతా నిరంతర వృద్ధినీ, స్వీయ మెరుగుదలనూ కొనసాగించేలా యోగా ప్రోత్సహిస్తుందనీ ఆయన తెలియజేశారు. ఇరవై ఏళ్ల వయసులో ఉన్నప్పటి కంటే.. నలభై ఏళ్ల వయసులో మరింత దృఢంగా, ముప్పై ఏళ్ల

వయసులో ఉన్నదాని కంటే యాభై ఏళ్ల వయసులో మరింత ఉత్సాహంగా, యాభై ఏళ్ల వయసులో ఉన్నదానికంటే డెబ్బై ఏళ్ల వయసులో జీవనశైలి వ్యాధులను తట్టుకొనేలా మరింత దృఢంగా ఉండేందుకు కృషి చేయాలని ఆయన సూచించారు. శారీరక దారుఢ్యాన్ని పెంపొందించడానికీ, శక్తి స్థాయిలను కొనసాగించడానికీ, ఒత్తిడినీ తగ్గించడానికీ, మానసిక శ్రేయస్సును ప్రోత్సహించడానికీ యోగా సాయపడుతుందని ప్రధాని వివరించారు. అదే సమయంలో జీవనశైలి రుగ్మతలను నివారించడంలో కూడా సహకరిస్తుందనీ తెలియజేశారు. "క్రమం తప్పకుండా యోగా సాధన చేయడం ద్వారా తమ శరీరాన్నీ, మెదడునీ నిత్యం అధ్యయనం చేసే వారిగా వ్యక్తులు మారుతారు. స్వీయ అవగాహనే.. స్వీయ నిర్వహణకూ, ఆరోగ్యకరమైన జీవితానికీ మార్గాన్ని అందిస్తుందని ఆయన చెప్పారు" అని మోదీ పేర్కొన్నారు.

"ఆరోగ్యవంతమైన ఆయుష్షు కోసం యోగా" అనే ఇతివృత్తం అన్ని వయసుల వారికీ వర్తిస్తుందని ప్రధానమంత్రి తెలియజేశారు. ఇది ఆరోగ్యం, శ్రేయస్సు, వ్యక్తిగత ఎదుగుదల దిశగా సాగే ప్రయాణంలో జీవితకాలం పాటు మన వెంట ఉండే స్నేహితునిగా యోగాను మారుస్తుందని ఆయన అన్నారు. ఈ సందర్భంగా భగవద్గీత బోధనల గురించి మోదీ వివరించారు. "సమతుల ఆహారపు అలవాట్లూ, సమతౌల్యమైన వినోదమూ, సమతూకంగా ఉండే పనులూ, సమతుల్యత ఉన్న నిద్ర–మెలకువ.. దుఃఖాల నుంచి విముక్తి పొందే మార్గంగా యోగాను మారుస్తాయి" అని చెప్పారు. ఈ సమభావమే యోగాకు అత్యంత ముఖ్యమైన పునాది అనీ, పరిపూర్ణమైన జీవితానికి కూడా అవసరమైనదనీ ప్రధాని అభిప్రాయపడ్డారు. సమతౌల్యంగా ఎలా జీవించాలో యోగా నేర్పిస్తుందన్నారు. మానవులు చేయాల్సిన వాటినీ, చేయకూడని వాటినీ తెలియజేస్తూ.. ఆరోగ్యకరమైన జీవనశైలిని పెంపొందించుకోవడానికి యోగా తోడ్పడుతుందని వివరించారు.

శారీరక వ్యాయామంగా మాత్రమే పరిమితం కాకుండా మానసిక ఆరోగ్యం నుంచి శారీరక ఆరోగ్యం దిశగా నడిచే మార్గాన్ని యోగా అందిస్తుందన్నారు. "యుక్తచేష్టస్య కర్మసు" అనే గీతా వాక్యాన్ని ఉటంకిస్తూ... ఏది సరైనదో, ఏది కాదో గుర్తించే విచక్షణను పెంపొందించుకోవడానికి యోగా



సహాయపడుతుందని తెలిపారు. "ఇలాంటి అవగాహన మానసిక ప్రశాంతతకు మూలాధారంగా మారుతుంది. అలాగే ప్రపంచ సామరస్యానికి మార్గాలను సుగమం చేస్తుంది. వ్యక్తిగత జీవనశైలి సాధనగా మాత్రమే పరిమితం కాకుండా.. ప్రపంచానికి మెరుగైన భవిష్యత్తును నిర్మించడానికి అవసరమైనదిగా యోగా మారింది" అని మోదీ అన్నారు.

అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా ఏటా కోట్లాది ప్రజలు యోగా కార్యక్రమాల్లో పాల్గొంటున్నారని మోదీ అన్నారు. అలాగే, యోగాను దైనందిన జీవితంలో భాగంగా మార్చుకోవడానికి ఉమ్మడి నిబద్ధతను పునరుద్ఘాటించే అవకాశాన్ని కూడా ఈ రోజు అందిస్తుందని పేర్కొన్నారు. కేవలం ఒక రోజుకో లేదా ఒక కార్యక్రమానికో యోగాను పరిమితం చేయకుండా.. తమ జీవితంలో, తమ కుటుంబంలో, భవిష్యత్తు తరాల జీవితాల్లో యోగాను శాశ్వత భాగంగా చేసుకోవాలని పిలుపునిచ్చారు. "యోగా 365" కార్యక్రమంలో సాధించిన పురోగతిని కూడా ప్రధానమంత్రి ప్రస్తావించారు. "దీనిలో భాగంగా నిర్వహించిన 100 రోజుల ఆన్‌లైన్ యోగా కార్యక్రమానికి ప్రజల నుంచి అపూర్వమైన ఆదరణ లభించింది. 130 దేశాల నుంచి మూడు మిలియన్లకు పైగా ప్రజలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఇది ప్రపంచవ్యాప్తంగా యోగాకు పెరుగుతున్న ఆమోదాన్నీ, ప్రజాదరణనూ ప్రతిబింబిస్తోంది" అని మోదీ తెలియజేశారు. మరింత బలమైన, సుసంపన్నమైన, ఆత్మవిశ్వాసం నిండిన దేశానికి ఆరోగ్యకరమైన సమాజమే పునాది వేస్తుందని అన్నారు. అందరి క్షేమాన్ని ఆకాంక్షిస్తూ... "సర్వే భవంతు సుఖినః సర్వే సంతు నిరామయాః" (అందరూ ఆనందంగా ఉండాలి. అందరూ ఆరోగ్యంగా ఉండాలి) ప్రార్థనా వాక్యాన్ని ఉటంకిస్తూ.. ప్రసంగాన్ని ముగించారు.■



# అంగరంగ వైభవంగా అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలు

కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి ఆధ్వర్యంలో సికింద్రాబాద్ ఫరేడ్ గ్రౌండ్ లో జూన్ 20న 1డే కౌంట్ డౌన్ ఈవెంట్ లో భాగంగా యోగా వేడుకలు ఘనంగా జరిగాయి. తెలంగాణ రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా, భారత మాజీ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యానాయుడు, బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు, రాజ్యసభ సభ్యులు డాక్టర్ కె. లక్ష్మణ్ లతో పాటు పలువురు ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులు, సినీతారలు, సెలబ్రిటీలు ఈ కార్యక్రమంలో పాల్గొని ఆసనాలు వేశారు. ఈ యోగా మహోత్సవానికి నగర నలుమూలల నుండి యువతీ యువకులు, విద్యార్థులు, మహిళలు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పెద్ద ఎత్తున హాజరయ్యారు. వేదిక ప్రాంగణమంతా యోగా సాధకులతో కిక్కిరిసిపోయింది.

ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న తెలంగాణ గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా ప్రసంగిస్తూ.. "ఈ రోజు మనం కేవలం ఒక శారీరక వ్యాయామ విధానాన్ని మాత్రమే జరుపుకోవడం కాదు వేల సంవత్సరాలుగా మానవాళికి ఆరోగ్యకరమైన జీవనం, మానసిక ప్రశాంతత, ఆధ్యాత్మిక సమతుల్యతకు మార్గం చూపిన భారతదేశపు సనాతన జ్ఞాన సంప్రదాయానికి గౌరవం తెలుపుతున్నాం. భారతదేశం ప్రపంచానికి అందించిన ఈ అమూల్య వారసత్వాన్ని నేడు ప్రపంచమంతా స్వీకరించడం మనకు గర్వకారణం. ప్రధానమంత్రి రేంద్ర మోదీ కృషి ఫలితంగా ఐక్యరాజ్యసమితి జూన్ 21ను అంతర్జాతీయ యోగా దినోత్సవంగా గుర్తించింది. నేడు యోగా దేశాల సరిహద్దులు, భాషలు, సంస్కృతులను దాటి ప్రపంచ మానవాళిని ఏకం చేసే శక్తిగా నిలిచింది. ఈ ఏడాది యోగా దినోత్సవం మనకు ఒక ముఖ్యమైన సందేశాన్ని అందిస్తోంది. ఆధునిక జీవితంలోని సవాళ్లు, ఒత్తిళ్లు, అసమతుల్యతల మధ్య యోగా మనకు ఆత్మవిశ్వాసం, క్రమశిక్షణ, సానుకూల శక్తిని ప్రసాదించే మహత్తర సాధనం. ఏ దేశానికైనా అసలైన బలం కేవలం దాని ఆర్థిక వ్యవస్థలో, సహజ వనరుల్లో లేదా సాంకేతిక పురోగతిలో ఉండదు. ఆ దేశపు సంస్కృతి, నాగరికత, విలువలలోనే దాని నిజమైన శక్తి దాగి ఉంటుంది. ఒక సమాజం తన మూలాలతో అనుసంధానమై ఉన్నప్పుడే భవిష్యత్తు వైపు ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగుతుంది. ముఖ్యంగా, ప్రపంచానికి భారతదేశం అందించిన యోగా నేడు ఒక ప్రపంచవ్యాప్త ప్రజా ఉద్యమంగా మారింది. గత కొన్ని సంవత్సరాలలో అంతర్జాతీయ యోగా దినోత్సవ కార్యక్రమాలలో 26 కోట్లకు పైగా ప్రజలు పాల్గొనడం, భారతదేశపు ఈ ప్రాచీన జ్ఞానం ప్రపంచ మానవాళి శ్రేయస్సుకు ఎంతగానో దోహదపడుతోందని స్పష్టం చేస్తోంది. యోగా మనకు ఒక గొప్ప సందేశాన్ని ఇస్తుంది. అభివృద్ధి, సంప్రదాయం పరస్పర విరుద్ధమైనవి కావు. ఆధునికతను స్వీకరిస్తూనే మన సాంస్కృతిక మూలాలతో అనుసంధానమై ఉండవచ్చు. అదే భారతదేశ మార్గం, అదే మన ప్రత్యేకత, అదే మన అతి పెద్ద బలం. ప్రపంచానికి శాంతి, మానవ సంక్షేమ మార్గాన్ని చూపే భారతదేశ నిర్మాణానికి కలిసి కృషి చేద్దాం." అని అన్నారు.

వెంకయ్య నాయుడు యోగా విశిష్టతను, నేటి సమాజానికి దాని ఆవశ్యకతను వివరిస్తూ "యోగాను ఏదో ఒక మతానికి పరిమితం చేసి చూడటం మూర్ఖత్వమే అవుతుంది. యోగా అనేది ఒక నిర్దిష్ట మతానికి సంబంధించింది కాదు అది సర్వమానవ సౌభ్రాతృత్వానికి, విశ్వశాంతికి దోహదపడే అద్భుత సాధనం. మన పూర్వీకులు ఎంతో పరిశోధించి, రంగరించి మానవాళికి అందించిన ఒక పరిపూర్ణ జీవన విధానం ఇది. భారతదేశం విశ్వగురువుగా నిలవడానికి మన సంస్కృతి, సంప్రదాయాలే కారణం. ప్రపంచానికి మన దేశం అందించిన అత్యంత గొప్ప, అపురూపమైన కానుక 'యోగా'. నేడు ప్రపంచం మొత్తం పాశ్చాత్య సంస్కృతి వ్యామోహంలో పడి అటు ఇటు కొట్టుమిట్టాడుతోంది. ఇలాంటి సమయంలో మానసిక ప్రశాంతతకు, శారీరక దృఢత్వానికి యోగా ఒక్కటే శరణ్యం. యోగా అనేది కేవలం కొన్ని శారీరక ఆసనాలు మాత్రమే కాదు.. అది మనిషిని సమగ్రమైన, సంపూర్ణమైన వ్యక్తిగా తీర్చిదిద్దుతుంది. మానవ చైతన్యానికి నిదర్శనమైన యోగా ద్వారా సర్వతోముఖాభివృద్ధి సాధ్యమవుతుంది. ఇది మనిషికి, ప్రకృతి మాతకు మధ్య అనుసంధానాన్ని పెంచే ఒక గొప్ప వరం. నేటి ఆధునిక కాలంలో మనుషులను పీడిస్తున్న మానసిక ఒత్తిడిని దూరం చేసి, గుండె నిండా స్థైర్యాన్ని, ఆధ్యాత్మిక భావనను పెంపొందించే శక్తి యోగాకు ఉంది. 'ఆరోగ్యమే మహాభాగ్యం' అనే నానుడిని నిజం చేయాలంటే ప్రతి ఒక్కరూ ప్రకృతి ఒడిలో జీవించడం అలవాటు చేసుకోవాలి. నిత్య జీవితంలో యోగాను భాగం చేసుకోవాలి." అని అన్నారు.

మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ మాట్లాడుతూ.. "యోగా అనేది అందరినీ ఏకం చేసే ఒక అద్భుత సాధనం. ఇందులో ఎలాంటి సామాజిక భేదభావాలు, కులమతాల పట్టింపులు ఉండవు. హిందువులు, ముస్లింలు, క్రిస్టియన్లు అనే తేడా లేకుండా ప్రతి ఒక్కరూ యోగాను తమ దైనందిన జీవన విధానంలో ఒక భాగంగా చేసుకోవాలి. ఇది సమాజంలో సమరసతను పెంపొందిస్తుంది. యోగా అంటే కేవలం శారీరక వ్యాయామం మాత్రమే కాదు అది మనసును, బుద్ధిని ప్రశాంతంగా, దృఢంగా ఉంచే ఒక గొప్ప మార్గం. మారుతున్న కాలంలో ఒత్తిడిని అధిగమించి, సరైన నిర్ణయాలు తీసుకునే మానసిక స్థైర్యాన్ని యోగా మనకు ప్రసాదిస్తుంది. యోగా అనేది జీవితాన్ని సంపూర్ణంగా జీవించేలా నేర్పే ఒక విశిష్టమైన



కళ. అదే సమయంలో నిత్యం ఎదురయ్యే అనారోగ్య సమస్యల నుండి మనల్ని కాపాడే ఒక దివ్యమైన మందు (ఔషధం) లాంటిది. శారీరక దృఢత్వానికి, మానసిక ప్రశాంతతకు యోగాను మించిన ప్రత్యామ్నాయం లేదు. ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణానికి ఆరోగ్యవంతులైన పౌరులు అవసరం. కాబట్టి, వయస్సుతో నిమిత్తం లేకుండా చిన్న పిల్లల నుండి వృద్ధుల వరకు ప్రతి ఒక్కరూ యోగాను ఒక అలవాటుగా మార్చుకోవాలి. నిత్యం యోగా సాధన చేస్తూ సంపూర్ణ ఆరోగ్యంతో జీవించాలి. భారతదేశానికి చెందిన అత్యంత ప్రాచీనమైన, విశిష్టమైన యోగాసనాలను అంతర్జాతీయ స్థాయిలో విశేష ప్రాచుర్యం కల్పించిన వ్యక్తి ప్రధాని మోదీ అని జి. కిషన్ రెడ్డి అన్నారు. "మోదీ చొరవతోనే ఐక్యరాజ్యసమితి (UN) అధికారికంగా జూన్ 21వ తేదీని 'అంతర్జాతీయ యోగా దినోత్సవం'గా ప్రకటించింది. ఇది ప్రతి భారతీయుడు గర్వించదగ్గ విషయం. దేశ ప్రజలందరూ సంపూర్ణ ఆరోగ్యంతో, ఆనందంగా ఉండాలనేదే కేంద్ర ప్రభుత్వ సంకల్పం. ప్రతి ఒక్కరూ యోగాను కేవలం ఒక వ్యాయామంగా కాకుండా, తమ దైనందిన జీవన విధానంలో (Life Style) ఒక భాగంగా చేసుకోవాలి. అప్పుడే ఆరోగ్యకరమైన, దృఢమైన భారతదేశ నిర్మాణం సాధ్యమవుతుంది." అని అన్నారు

రాజ్యసభ సభ్యులు, బిజెపి ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షులు డాక్టర్ కె. లక్ష్మణ్ మాట్లాడుతూ.. "యోగా అనేది భారతదేశం ప్రపంచానికి అందించిన అత్యంత విలువైపన సంపద. మన దేశ గొప్పదనాన్ని, ప్రాచీన సంస్కృతిని విశ్వవ్యాప్తం చేయడంలో యోగా కీలక పాత్ర పోషించింది. యోగా అనేది ఈనాటి వ్యాయామం కాదు, అది మన పూర్వీకులు జీవన విధానంలో భాగంగా ఆచరించిన అత్యంత ప్రాచీన సంస్కృతి, సాంప్రదాయం. నేటి ఆధునిక కాలంలో ప్రతి ఒక్కరికీ శారీరక ఆరోగ్యంతో పాటు ఆధ్యాత్మిక చింతన కూడా ఎంతో



అవసరం.'' అని అన్నారు. మానసిక ప్రశాంతతను అందిస్తూ, మనిషిని అంతర్గతంగా దృఢపరిచే శక్తి ఒక్క యోగాకే ఉందని, దీనిని ప్రతి ఒక్కరూ నిత్య జీవితంలో భాగం చేసుకోవాలని పిలుపునిచ్చారు.

మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్ మాట్లాడుతూ.. ''భారతదేశ ప్రాచీన సంస్కృతి, సాంప్రదాయాలలో యోగా ఒక భాగం. నరేంద్ర మోదీ దేశ ప్రధానమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన తర్వాతే, మన దేశ సంపదైన యోగాను ప్రపంచ దేశాలన్నింటికీ పరిచయం చేశారు. నేడు ప్రపంచవ్యాప్తంగా యోగా వేడుకలను ఘనంగా జరుపుకోవడం ప్రతి భారతీయుడికి ఎంతో సంతోషాన్నిచ్చే విషయం. దేశ భవిష్యత్తు యువత చేతుల్లోనే ఉంది. నేటి యువత మానసికంగా ప్రశాంతంగా, శారీరకంగా దృఢంగా ఉండాలంటే నిత్యం యోగాసనాలు వేయడం ఎంతో అవసరం. యువత ఒత్తిడిని అధిగమించి సంపూర్ణ ఆరోగ్యవంతులుగా మారేందుకు యోగా ఒక అద్భుత సాధనంగా ఉపయోగపడుతుంది. ప్రతి ఒక్కరూ యోగాను అలవాటు చేసుకొని ఆరోగ్యకరమైన సమాజాన్ని నిర్మించాలి.'' అని పిలుపునిచ్చారు.■

# యోగా భారతదేశం ప్రపంచానికి అందించిన వరం

యోగా ప్రపంచానికి భారతదేశం అందించిన శాశ్వతమైన నాగరికతా వరమని బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు స్పష్టం చేశారు. యోగాను అంతర్జాతీయ వేదికపైకి తీసుకెళ్లి, దానిని ఒక ప్రపంచవ్యాప్త ఉద్యమంగా మార్చిన ఘనత ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి దక్కుతుందని తెలిపారు. ప్రపంచమంతా అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని అత్యంత ఉత్సాహంగా జరుపుకొంటోందని అన్నారు. జూన్ 21న సికింద్రాబాద్ మహంకాళీ జిల్లా అధ్యక్షుడు గుండగోని భరత్ గౌడ్ ఆధ్వర్యంలో హైదరాబాద్ ఇందిరా పార్క్‌లో నిర్వహించిన 12వ అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, యోగా అనేది కేవలం శారీరక వ్యాయామం మాత్రమే కాదని, అది మానసిక ఆరోగ్యాన్ని, శ్రేయస్సును బలోపేతం చేసే సంపూర్ణ జీవన విధానమని పేర్కొన్నారు.

నేటి ఉరుకులు పరుగుల జీవితంలో ప్రజలు ఒత్తిడి, నిరాశ, జీవనశైలి సంబంధిత ఆరోగ్య సమస్యలను ఎక్కువగా ఎదుర్కొంటున్నారని, అటువంటి పరిస్థితుల్లో యోగా సహజమైన, శక్తివంతమైన పరిష్కారాన్ని అందిస్తుందని అన్నారు. ప్రతి చిన్న ఆరోగ్య సమస్యకైనా ప్రజలు మాత్రలు, మందులపై ఆధారపడుతున్నారని, అయితే యోగాను



క్రమం తప్పకుండా అభ్యసించడం ద్వారా ఆరోగ్యకరమైన, ప్రశాంతమైన, సమతుల్యమైన జీవితాన్ని గడపవచ్చని పేర్కొన్నారు. యోగా మానసిక దృఢత్వాన్ని పెంపొందించడమే కాకుండా, సమగ్ర ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుందని తెలిపారు. ప్రత్యేకంగా విద్యార్థులు, యువత ప్రతిరోజూ యోగాను తమ జీవితంలో భాగంగా చేసుకోవాలని పిలుపునిచ్చారు. అనేక పాఠశాలలు కూడా విద్యార్థులను యోగా వైపు ప్రోత్సహించడం సంతోషకరమైన విషయమని, ఇది చిన్న వయస్సు నుంచే పిల్లల్లో ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చేందుకు దోహదపడుతుందని అన్నారు. యోగాను ప్రతి ఒక్కరూ తమ నిత్యజీవితంలో ఒక భాగంగా చేసుకోవాలని ప్రజలకు పిలుపునిచ్చారు.■



# కాంగ్రెస్ పాలకులకు 'లంకెబిందె'లా సింగరేణి

"సింగరేణి సంస్థను గత బీఆర్ఎస్ ప్రభుత్వం కొంగు బంగారంగా చెప్పుకొంటూ నిలువునా ముంచితే, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం అంతకుమించి దోచుకుంటూ అప్పుల ఊబిలోకి నెడుతోంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రతి దానికీ లంకెబిందెలు అంటుంటారు.. కానీ ఆయనకు నిజంగానే సింగరేణి రూపంలో లంకెబిందెలు దొరికినట్లు ఉన్నాయి. అందుకే ఇక్కడి సంపదను దోచుకొని హైదరాబాద్‌కు తరలిస్తున్నారు. సింగరేణిలో జరుగుతున్న వేల కోట్ల రూపాయల కుంభకోణాలపై కాంగ్రెస్ ప్రభుత్వానికి దమ్ము, ధైర్యం ఉంటే వెంటనే హౌస్ కమిటీ వేయాలి లేదా సీబీఐ విచారణకు ఆదేశించాలని" బిజెపి శాసనసభాపక్ష నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి డిమాండ్ చేశారు. ఏకంగా 40 లక్షల మెట్రిక్ టన్నుల బొగ్గు మాయం వెనుక ఉన్న నిజాలను నిలదీసేందుకు "సింగరేణిని కాపాడుకుందాం" అనే అజెండాతో మంచిర్యాల జిల్లా శ్రీరాంపూర్ మైన్ విజిట్ కోసం మహేశ్వర్ రెడ్డి నేతృత్వంలోని బిజెపి ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల ప్రతినిధి బృందం బయలుదేరింది. అయితే ఈ బృందాన్ని రాష్ట్ర ప్రభుత్వం అడ్డుకొని, అరెస్ట్ చేసింది. ఈ అరెస్టును మహేశ్వర్ రెడ్డి తీవ్రంగా ఖండించారు. మూడు రోజుల క్రితమే ఎమ్మెల్సీ అంజిరెడ్డి, రఘునాథరావు ఆధ్వర్యంలో లేఖ ఇచ్చి, ఎండీ ఆహ్వానం మేరకే ఇక్కడికి వచ్చామని స్పష్టం చేశారు. అయినప్పటికీ పోలీసులను ప్రయోగించి, కార్యకర్తలను, నాయకులను ఈడ్చుకుంటూ వెళ్లి అరెస్ట్ చేయడం రాష్ట్రంలోని అరాచక పాలనకు అద్దం పడుతోందని మండిపడ్డారు. గతంలో పీసీసీ అధ్యక్షుడిగా రేవంత్ రెడ్డి, సీఎల్పీ నేతగా భట్టి విక్రమార్క సింగరేణి అవినీతిపై చిలుక పలుకులు పలికారని.. తీరా ఇప్పుడు అధికారం చేతికి రాగానే విద్యుత్ శాఖ మంత్రిగా భట్టి విక్రమార్క ఈ వ్యవస్థను జేబులో పెట్టుకొని, గత పాలకుల అక్రమాలను కప్పిపుచ్చుతూ బీఆర్ఎస్‌తో చీకటి ఒప్పందం చేసుకున్నారని ఆరోపించారు.

కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి స్వయంగా సింగరేణిలో 40 లక్షల మెట్రిక్ టన్నుల బొగ్గు మాయమైందని, రూ.1,600 కోట్ల కుంభకోణం జరిగిందని ముఖ్యమంత్రికి లేఖ రాస్తే ఇప్పటివరకు ఎందుకు సమాధానం ఇవ్వలేదని నిలదీశారు. ప్రస్తుతం ఈ నిర్బంధ దోపిడీని కప్పిపుచ్చుకోవడానికి, ప్రొడక్షన్ ఎక్కువ చేస్తూ రికార్డుల్లో తక్కువ చూపిస్తూ రీస్టోరేషన్ పథకం వేస్తున్నారని.. అందుకే బిజెపి బృందాన్ని రానివ్వకుండా అడ్డుకున్నారని ఆరోపించారు.

రాష్ట్ర ప్రభుత్వం రూ.51,500 కోట్ల బకాయిలను సింగరేణికి చెల్లించకుండా తొక్కిపెట్టిందని, ఆ డబ్బులు ఇచ్చుంటే 40 వేల మంది కార్మికుల కుటుంబాలకు క్వార్టర్లు, నీరు, స్కూళ్లు, కాలేజీలు, హాస్పిటళ్లు, మైన్స్‌లో కనీస రక్షణ (సేఫ్టీ) పరికరాలు సమకూరేవని ఆవేదన వ్యక్తం చేశారు.

సోలార్ స్కామ్‌ను ప్రస్తావిస్తూ.. దేశవ్యాప్తంగా మెగావాట్ సోలార్ ప్రాజెక్టుకు రూ.3.5 కోట్లు ఖర్చవుతుంటే, సింగరేణిలో 107 మెగావాట్ల ప్రాజెక్టును రూ.5.04 కోట్ల చొప్పున చేపట్టి రూ.200 కోట్లు అదనంగా దోచుకున్నారని, అలాగే 67 మెగావాట్ల ప్రాజెక్టుకు ఏకంగా రూ.7 కోట్ల చొప్పున రూ.480 కోట్లు తగలేసి ఇప్పటికీ గ్రిడ్‌కు అనుసంధానం చేయకుండా వదిలేశారని మండిపడ్డారు. సింగరేణి తెలంగాణ ప్రజల ఆస్తి అని, కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి విచారణ చేయాలని లేఖ రాసినందున, రాష్ట్ర ప్రభుత్వం వెంటనే హౌస్ కమిటీ లేదా అఖిలపక్ష కమిటీ వేసి నిజనిర్ధారణ చేయాలని లేదంటే సీబీఐకి అనుమతి ఇవ్వాలని డిమాండ్ చేశారు. సింగరేణి కార్మికుల, ప్రజా సమస్యల పక్షాన బిజెపి నిరంతరం పోరాడుతుందని, రాబోయే రోజుల్లో దీనిపై బలమైన కార్యాచరణ ప్రకటిస్తామని ఏలేటి మహేశ్వర్ రెడ్డి హెచ్చరించారు. గత ప్రభుత్వం వేల కోట్లు దోచుకుంటే, మేమేం తక్కువ తిన్నామా అన్నట్లు కాంగ్రెస్ ప్రభుత్వం కొత్తగా 'సైట్ విజిట్ సర్టిఫికెట్' అనే బూటకపు పాలసీని తెరపైకి తెచ్చిందని మండిపడ్డారు. భారతదేశంలో ఏ కోల్ మైన్ లోనూ, కోల్ ఇండియాలోనూ లేని ఈ దొంగ నిబంధనను కేవలం తమ అనుకూల కాంట్రాక్టర్లకు టెండర్లు కట్టబెట్టడానికే తెచ్చారని ఆరోపించారు. వీకేఓసీ (VKOC) ఓపెన్ కాస్ట్‌లో కాంట్రాక్ట్ దక్కించుకున్న వ్యక్తి రేవంత్ రెడ్డికి ఏమవుతాడో, ఎంత అత్యధిక రేటుకు దాన్ని కట్టబెట్టారో ముఖ్యమంత్రి సమాధానం చెప్పాలన్నారు. అలాగే కేంద్రం కేటాయించిన నైనీ బ్లాక్ టెండర్లలో సీఎం నా మనిషికి కావాలని, డిప్యూటీ సీఎం నా మనిషికి కావాలని కొట్లాడుకొని, చివరకు ఆ టెండర్లనే క్యాన్సిల్ చేశారని.. ఒకవేళ అవి ఓపెన్ అయ్యి ఉంటే ఈరోజు బయట ఎక్కువ ధరకు బొగ్గు కొనాల్సిన అవసరం ఉండేది కాదన్నారు. గతంలో ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ నుండి నేరుగా డీజిల్ కొనేవారని, ఇప్పుడు మధ్యవర్తులు, గుత్తేదారుల ద్వారా కొంటూ సింగరేణిపై అదనపు భారం మోపుతున్నారని విమర్శించారు.

గత 2014 నుండి 2023–24 వరకు సింగరేణిలో బీఆర్ఎస్ హయాంలో జరిగిన వేల కోట్ల కుంభకోణాలను ఎండగట్టారు. 2014లో తాడిచెర్ల బొగ్గు బ్లాక్‌ను కేంద్రం కేటాయిస్తే, నాణ్యత లేదనే నెపంతో తిరిగిచ్చి, ఆ తర్వాత నాటి ప్రభుత్వ స్నేహితుడైన ఏఎంఆర్ కన్ స్ట్రక్షన్ కంపెనీకి కట్టబెట్టారని తెలిపారు. ప్రతి టన్నుకు రూ.560 ఎస్కలేషన్ ఉండాల్సి ఉంటే, ఏకంగా రూ.3,500 లకు పెంచి రూ.20,000 కోట్ల భారీ కుంభకోణానికి తెరలేపారని, దీనిపై కాంగ్రెస్ ఎందుకు దర్యాప్తు వేయడం లేదని ప్రశ్నించారు. అలాగే సింగరేణి థర్మల్ పవర్ ప్లాంట్ లో నైనీ గనుల బొగ్గును తీసుకోకుండా బ్రిడ్జ్ లింకేజ్ ఇవ్వకపోవడం వల్ల రూ.289.91 కోట్ల నష్టం వాటిల్లిందన్నారు. సొంత అవసరాల విద్యుత్‌ను డిస్కంలకు తక్కువకు అమ్మి, మళ్లీ ఎక్కువ ధరకు బయట కొనుగోలు చేయడం వల్ల రూ.288.96 కోట్లు, నాసిరకం బొగ్గు వినియోగం వల్ల రూ.156.10 కోట్లు, బాయిలర్ ట్యూబ్ లీకేజీతో 53 గంటలు ప్లాంట్ నిలిచిపోవడం వల్ల రూ.219.58 కోట్లు, బూడిదలో కాలిపోని బొగ్గు వల్ల రూ.27 కోట్లు.. ఇలా మొత్తంగా ఎస్టీపీపీలోనే రూ.982 కోట్ల నష్టం వాటిల్లిందని లెక్కలతో సహా వివరించారు.

2018 నుండి 2023 వరకు సింగరేణిలో మంజూరు చేసిన 36 ఓబీఆర్ (OBR) కాంట్రాక్టులలో సాధారణ టెండర్లు మైనస్ 10% నుండి 15% లోపు వస్తుంటే, సింగరేణిలో మాత్రం నిబంధనలకు విరుద్ధంగా 12.36% నుండి 32% వరకు అత్యధిక రేట్లకు ప్రైవేట్ గుత్తేదారులకు కట్టబెట్టారని మండిపడ్డారు. మిస్ అప్రోప్రియేషన్ వల్ల రూ.51.05 కోట్ల నష్టం జరిగిందని కాగ్ రిపోర్టు కోడై కూస్తున్నా ప్రభుత్వం ఎందుకు నిమ్మకు నీరెత్తినట్లు ఉందని నిలదీశారు. కాంట్రాక్టుల ఆలస్యం వల్ల రూ.74.19 కోట్లు, సర్ఫేస్ ట్రాన్స్‌పోర్ట్ ద్వారా వినియోగదారుల నుండి అదనంగా రూ.78.94 కోట్లు వసూలు చేయడం వాస్తవం కాదా అని ప్రశ్నించారు. శ్రీరాంపూర్ ఏరియాలో టన్ను రూ.78 కే లభించే బాటం యాష్‌ను వదిలేసి, టన్నుకు రూ.263 చెల్లించి ఇసుకను కొనడం ద్వారా రూ.26 కోట్ల నష్టం తెచ్చారని, ఇలా గత పాలకుల వల్ల రూ.1430 కోట్ల నష్టం వాటిల్లిందని స్పష్టం చేశారు.■

# ముఖర్జీకి ఘన నివాళి పశ్చిమ బెంగాల్ విజయం

*జులై 6 డాక్టర్ శ్యామా ప్రసాద్ ముఖర్జీ జయంతి సందర్భంగా ప్రత్యేక వ్యాసం*

ఈ ఏడాది జులై 6న డాక్టర్ శ్యామా ప్రసాద్ ముఖర్జీ జయంతికి ఒక విశిష్టత ఉంది. ఆయన స్థాపించినప్పటికీ (జనసంఘ్) సొంతరాష్ట్రమైన బెంగాల్లో ఇప్పటివరకు ఒక్క ఎన్నికలో కూడా గెలవని బిజెపి చివరకు అదే రాష్ట్రంలో అఖండ మెజారిటీతో విజయం సాధించి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. నిస్సందేహంగా ఇది ఆయనకు కోట్లమంది బిజెపి కార్యకర్తలు అర్పించే ఘననివాళి ఇది. దశాబ్దాల సుదీర్ఘ సైద్ధాంతిక నిబద్ధత, నిరంతర క్షేత్రస్థాయి కృషి తర్వాత బిజెపి ఒకప్పుడు అసాధ్యమనిపించిన దాన్ని సాధించి చూపించింది. పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికలు 2026 లో బిజెపి సాధించిన ఈ ఘన విజయం కేవలం ఒక ఎన్నికల విజయం మాత్రమే కాదు, దశాబ్దాల క్రితం బెంగాల్ ఉత్తమ పుత్రులలో ఒకరైన డాక్టర్ శ్యామా ప్రసాద్ ముఖర్జీ పునాది వేసి కలలు గన్న ఒక భావజాల పునరుజ్జీవనం.

ఈ ఎన్నికల తీర్పు సైద్ధాంతిక, సాంస్కృతిక ప్రాముఖ్యాన్ని అర్థం చేసుకోవాలంటే మనం చరిత్రలోకి ఒక్క అడుగు వెనక్కి వేసి డాక్టర్ శ్యామా ప్రసాద్ ముఖర్జీ జీవితాన్ని సింహావలోకనం చేసుకోవాలి. ఆయన కేవలం విపక్షంలో ఉన్నాం కనుక వ్యతిరేకించాలని వ్యతిరేకించిన నాయకుడు కాదు; జాతీయ సమగ్రత, సాంస్కృతిక విశిష్టత గురించి బలమైన ఆలోచనలు కలిగిన ఒక దార్శనిక చింతనాపరుడు, గొప్ప రాజనీతిజ్ఞుడు. నిజానికి ఈరోజు పశ్చిమ బెంగాల్ ఉనికిలో ఉందంటే దానికి డాక్టర్ శ్యామా ప్రసాద్ ముఖర్జీయే కారణం. మొత్తం బెంగాల్‌ను (తూర్పు, పశ్చిమ) పాకిస్తాన్‌లో చేర్చాలనే ముస్లిం లీగ్ డిమాండ్‌కు వ్యతిరేకంగా ఒక బలమైన గోడలా నిలిచారు. భారత యూనియన్‌లో బెంగాలీ హిందువుల కోసం పశ్చిమ బెంగాల్ అనే సొంతగడ్డను ఏర్పాటు చేయడానికి, 1947 లో బెంగాల్ విభజన కోసం 'బెంగాలీ హిందూ హోమ్‌ల్యాండ్ మూవ్‌మెంట్'ను ప్రారంభించారు.


పశ్చిమ బెంగాల్ ఇచ్చిన ఈ ఎన్నికల తీర్పులో లోతైన చారిత్రక ప్రాధాన్యం దాగి ఉంది. డెబ్బై నాలుగు సంవత్సరాల క్రితం, 1951–52 లో జరిగిన భారతదేశపు మొట్టమొదటి సార్వత్రిక ఎన్నికలలో, భారతీయ జనసంఘ్ తన తొలి ప్రయత్నంలో దేశవ్యాప్తంగా కేవలం మూడు స్థానాలను మాత్రమే గెలుచుకుంది. విశేషమేమిటంటే, ఆ మూడు విజయాలలో రెండు బెంగాల్ నుంచే వచ్చాయి. ఒకటి ఆ పార్టీ వ్యవస్థాపకుడు డాక్టర్ శ్యామా ప్రసాద్ ముఖర్జీ సౌత్ కలకత్తా నుండి గెలవగా, మరొకటి ఝూర్ గ్రామ్ నుండి దుర్గా బెనర్జీ సాధించారు. అప్పట్లో ఒక సాధారణమైన ఆరంభంగా అనిపించిన ఆ విజయం, ఈ రోజు ఒక ఉద్యమ నిష్పూకణంగా స్ఫూరిస్తోంది. పశ్చిమ బెంగాల్ గడ్డపై పుట్టిన ఆ ఉద్యమం, దశాబ్దాల పోరాటం, పట్టుదల తర్వాత ఎట్టకేలకు తన సొంత గూడైన బెంగాల్ కు చేరుకుంది. బిజెపిని తీర్చిదిద్దడమే కాకుండా, నవ భారత నిర్మాణానికి పునాది వేసిన గొప్ప స్రష్ట, మేధావి, న్యాయకోవిదుడు, సామాజిక సంస్కర్తకు ఒక హృదయపూర్వక నివాళి.

డాక్టర్ శ్యామా ప్రసాద్ ముఖర్జీ తండ్రి ప్రసిద్ధ బెంగాలీ విద్యావేత్త, న్యాయమూర్తి, గణిత శాస్త్రజ్ఞుడైన సర్ అశుతోష్ ముఖర్జీ. అశుతోష్ ముఖర్జీని ఆయన ధైర్యసాహసాలు, విద్యా నిబద్ధత, అద్భుతమైన పరిపాలనా సామర్థ్యానికి గాను 'బంగ్లార్ బాగ్' (బెంగాల్ పులి) అని పిలిచేవారు. ఆయన కలకత్తా విశ్వవిద్యాలయానికి వరుసగా నాలుగు సార్లు (1906–1914), అలాగే ఐదవ సారి (1921–23) వైస్–ఛాన్సలర్‌గా సేవలు అందించారు. కలకత్తాలో పలు ప్రధాన విద్యా, శాస్త్ర సాంకేతిక సంస్థల స్థాపనకు ఆయనే కారణం. పండితుడైన తండ్రి మాదిరిగానే డాక్టర్ శ్యామా ప్రసాద్ ముఖర్జీ కూడా 33 ఏళ్ల పిన్న వయసులోనే కలకత్తా విశ్వవిద్యాలయానికి అత్యంత చిన్న వయస్కుడైన వైస్–ఛాన్సలర్‌గా బాధ్యతలు చేపట్టి, 1938 వరకు ఆ పదవిలో కొనసాగారు. డాక్టర్ ముఖర్జీ లింకన్స్ ఇన్‌లో న్యాయశాస్త్రం అభ్యసించి, 1926 లో బార్ కౌన్సిల్‌లో చేరారు. 1938 లో కలకత్తా విశ్వవిద్యాలయం నుండి డి.లిట్ పట్టా పొందారు. తన పదవీకాలంలో ఆయన అనేక ప్రయోజనకరమైన మార్పులను తీసుకువచ్చారు. కలకత్తాలోని ఏషియాటిక్ సొసైటీ, బెంగళూరులోని

ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ కౌన్సిల్, ఇంటర్–యూనివర్శిటీ బోర్డులతో చురుగ్గా పాలుపంచుకున్నారు.

డాక్టర్ ముఖర్జీ కలకత్తా విశ్వవిద్యాలయం తరపున బెంగాల్ లెజిస్లేటివ్ కౌన్సిల్‌కు కూడా ఎన్నికయ్యారు. కృషక్ ప్రజా పార్టీ–ముస్లిం లీగ్ సంకీర్ణం అధికారంలో ఉన్నప్పుడు, ఆయన ప్రతిపక్ష నాయకుడిగా వ్యవహరించారు. ఏ.కే. ఫజ్లుల్ హక్ నేతృత్వంలోని ప్రోగ్రెసివ్ కోయలిషన్ మినిస్ట్రీ ఏర్పాటులో కీలక పాత్ర పోషించి, దానికి ఆర్థిక మంత్రిగా కూడా పనిచేశారు. ఆయన 1939 లో హిందూ మహాసభలో చేరి, 1940 లో దానికి తాత్కాలిక అధ్యక్షుడయ్యారు. భారతదేశానికి సంపూర్ణ స్వాతంత్ర్యం సాధించడమే హిందూ మహాసభ ఏకైక రాజకీయ లక్ష్యమని ఆయన ప్రకటించారు. 1946 లో ఆయన భారత రాజ్యాంగ పరిషత్ సభ్యుడిగా ఎన్నికయ్యారు. ఆ తర్వాత ప్రధానమంత్రి జవహర్‌లాల్ నెహ్రూ క్యాబినెట్‌లో పరిశ్రమలు, సరఫరాల శాఖ మంత్రిగా పనిచేశారు. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత భారత ప్రభుత్వ తొలి పారిశ్రామిక విధానాన్ని ఆయనే రూపొందించారు.

1947 లో భారతదేశ విభజన సమయంలో, అప్పటి బెంగాల్ ప్రధానమంత్రి హుస్సేన్ షహీద్ సుహ్రావర్దీ.. బెంగాల్ ప్రావిన్స్‌ను అఖండ, సార్వభౌమ రాజ్యంగా మార్చాలనే కుటిలమైన 'యునైటెడ్ బెంగాల్' (ఐక్య బెంగాల్) ప్రతిపాదనను ముందుకు తెచ్చారు. ఆర్థిక సమగ్రత, పరస్పరం ఆధారపడటం, బలమైన రాజ్యాన్ని నిర్మించాల్సిన అవసరం దృష్ట్యా బెంగాల్ అవిభాజ్యమైనదని ఆయన గట్టిగా వాదించారు. అయితే ఈ ఐక్య బెంగాల్ ప్రతిపాదన హిందువులను ముస్లిం పాలనలో బతికే పరిస్థితికి గురిచేస్తుందని నమ్మిన డాక్టర్ ముఖర్జీ నేతృత్వంలోని హిందూ మహాసభ, దీనికి వ్యతిరేకంగా తీవ్రమైన ఉద్యమాన్ని ప్రారంభించింది. వైస్రాయ్ మౌంట్‌బాటన్‌కు రాసిన లేఖలో ముఖర్జీ ఇలా వాదించారు: "గడిచిన పదేళ్ల బెంగాల్ పరిపాలనపై ఎప్పుడైనా నిష్పాక్షికమైన సర్వే జరిగితే.. హిందువులు కేవలం మతపరమైన అల్లర్లు, అలజడుల వల్లే కాకుండా విద్యా, ఆర్థిక, రాజకీయ, మతపరమైన అన్ని రంగాలలోనూ తీవ్రంగా నష్టపోయారని స్పష్టమవుతుంది."



డాక్టర్ ముఖర్జీ 1951 అక్టోబర్ 21 న భారతీయ జనసంఘ్‌ను స్థాపించి, దానికి మొదటి అధ్యక్షుడయ్యారు. ఇదే 1980లో బిజెపిగా అవతరించింది. ఆయన పార్లమెంటులో 32 మంది లోక్‌సభ, 10 మంది రాజ్యసభ సభ్యులతో కూడిన నేషనల్ డెమోక్రటిక్ పార్టీని కూడా ఏర్పాటు చేశారు. స్వతంత్ర భారతదేశ క్యాబినెట్‌లో డాక్టర్ ముఖర్జీ అనధికారిక ప్రతిపక్ష నాయకుడిగా గుర్తింపు పొందారు. అధికరణం 370 జమ్మూ కాశ్మీర్‌కు సొంత జెండా, సొంత చట్టం, సొంత ప్రధానమంత్రిని అందించింది. అలాగే భారతీయులు తమ సొంత ప్రాంతాన్ని సందర్శించడానికి ప్రత్యేక అనుమతి తీసుకోవాల్సిన పరిస్థితిని కల్పించింది. ఈ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ ఆయన ఒకసారి, 'ఏక్ దేశ్ మే దో విధాన్, దో ప్రధాన్ ఔర్ దో నిషాన్ నహీ చలేంగే" (ఒకే దేశంలో రెండు రాజ్యాంగాలు, ఇద్దరు ప్రధానులు, రెండు జెండాలు చెల్లవు) అని సింహగర్జన చేశారు. డాక్టర్ ముఖర్జీ 1953 లో కాశ్మీర్‌ను సందర్శించడానికి వెళ్లారు. కాశ్మీర్ సరిహద్దు దాటుతుండగా మే 11 న ఆయనను అరెస్టు చేశారు. తనకు పెన్సిలిన్ అలర్జీ ఉందని ఇన్–ఛార్జ్ వైద్యుడికి తెలిపినప్పటికీ, ఆయనకు పెన్సిలిన్ ఇంజెక్షన్ ఇచ్చారు. ఫలితంగా 1953 జూన్ 23 న ఆయన నిర్బంధంలోనే కన్నుమూశారు. జమ్మూ కాశ్మీర్‌లో ఆయన అరెస్టును, మరణాన్ని మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయి 'నెహ్రూ కుట్ర'గా అభివర్ణించారు.

బిజెపి 2026 విజయాన్ని చారిత్రాత్మకం చేసింది దాని గెలుపు స్థాయి కాదు, దాని ప్రతీకాత్మక ప్రాధాన్యం. భారతీయ జనసంఘ్ ఏ గడ్డ మీదయితే ఉద్భవించిందో, ఆ నేలను సాంస్కృతికంగా పునరుద్ధరించడమే దీని ప్రత్యేకత. 1952 లో పశ్చిమ బెంగాల్ నుంచి పార్లమెంటులో కేవలం రెండు సీట్లు సాధించిన నాటి నుంచి 2026లో పశ్చిమ బెంగాల్ అసెంబ్లీలో 200కి పైగా సీట్లు సాధించే వరకు–పశ్చిమ బెంగాల్ చరిత్ర చివరకు తన అసంపూర్ణ అధ్యాయాన్ని అత్యంత అద్భుతంగా ముగించింది!

**– శిశిర్ బజోరియా పశ్చిమ బెంగాల్ బిజెపి నాయకుడు, శుభేందు ఆనంద్ సుప్రీంకోర్టు న్యాయవాది**


చదువులో ఆనందాన్ని పొందితే జీవితంలో ఉన్నత శిఖరాలు చేరుకుంటాం: మహాత్మా గాంధీ

# మెట్రోరైల్ ఫేజ్-2లో రేవంత్ ప్రభుత్వ అలసత్వం బహిర్గతం

● కృష్ణ చైతన్య

మెట్రోరైల్ ఫేజ్–2 అనుమతులు, పెండింగ్ నిధుల విషయంలో కేంద్ర ప్రభుత్వమే రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం కారణంగా జాప్యం చేస్తున్నదని, ముఖ్యంగా కేంద్రమంత్రి కిషన్ రెడ్డి అడ్డుపడుతున్నారని అంటూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పదే పదే చేస్తున్న ఆరోపణలకు బ్రేక్ పడింది. కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి చొరవతో రైల్వే మంత్రి అశ్వనీ వైష్ణవ్, కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ మంత్రి మనోహర్ లాల్ ఖట్టర్ లతో వరుసగా ముఖ్యమంత్రి జరిపిన ఉమ్మడి భేటీలలో ఈ విషయంలో కేంద్ర ప్రభుత్వ జాప్యం ఏమాత్రం లేదని, రాష్ట్ర ప్రభుత్వ ఆలస్యం కారణంగానే ఈ ప్రాజెక్ట్ కార్యరూపం దాల్చడం లేదని స్పష్టమైంది. రైల్వే శాఖ పరంగా ఎలాంటి అడ్డంకులు లేవని, కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ మంత్రిని కలిసి జరుగుతున్న జాప్యం ఎక్కడ ఉందో తెలుసుకోమని రైల్వే మంత్రి తేల్చి చెప్పడంతో రేవంత్ రెడ్డి ఏమీ మాట్లాడలేకపోయారు. పైగా, జపాన్ నుంచి నేరుగా రుణం వచ్చిందని ఎందుకు అబద్ధాలు చెప్తున్నారంటూ నిలదీయడంతో ముఖ్యమంత్రి సమాధానం చెప్పలేకపోయారు. పైగా, ఈ విషయంలో కిషన్ రెడ్డిని దోషిగా చూపుతూ సీఎం రేవంత్ రెడ్డిపై చేస్తున్న ఆరోపణలపై అశ్వినీ వైష్ణవ్ తీవ్ర అసహనం వ్యక్తం చేసినట్టు తెలిసింది. 'కిషన్ రెడ్డి, కేంద్ర ప్రభుత్వం వేర్వేరు కాదు. మీరు కిషన్ రెడ్డిని తిడుతూ కేంద్రం వద్ద సహాయం ఎలా అడుగుతారు? మెట్రోపై మీకసలు చిత్తశుద్ధి లేదు. అందుకే ఇలా మాట్లాడుతున్నారా? ఖట్టర్‌ను కలవండి. అంతా ఒకే అనుకుంటే అప్పుడు చూద్దాం' అంటూ ఆగ్రహం వ్యక్తం చేసినట్లు సమాచారం.

మెట్రో అంశం రైల్వే శాఖ పరిధిలోనిది కానందున కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ మంత్రితో తాను మాట్లాడతానని హామీ ఇవ్వడంతో పాటు వెంటనే ఆ శాఖ మంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్‌తో ఫోన్‌లో మాట్లాడినట్లు సమాచారం నిన్నమొన్నటి వరకు మెట్రో నిధుల విషయంలో పరస్పరం తీవ్ర విమర్శలు, సవాళ్లతో విరుచుకుపడిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి రాజకీయ విభేదాలను పక్కనబెట్టి చివరకు ఒక్కటిగా వెళ్లి కేంద్ర మంత్రులను కలిశారు. ఈ సమావేశాలకు అపాయింట్మెంట్ కూడా కిషన్ రెడ్డే తీసుకున్నారు. హైదరాబాద్ మెట్రో రైలు మొదటి దశ స్వాధీనం కోసం రాష్ట్రానికి రావాల్సిన రుణాన్ని కిషన్ రెడ్డి ఆపేశారని, ఇండియన్ రైల్వే ఫైనాన్స్ కార్పొరేషన్(ఐఆర్ఎఫ్‌సీ) ఖాతాలో జమయిన రూ.13,600 కోట్లను రాష్ట్ర ప్రభుత్వానికి ఇవ్వకుండా నిలిపివేయించారని అంతకుముందు వారం సీఎం రేవంత్ తీవ్ర ఆరోపణలు చేశారు. అయితే, ప్రాజెక్టులను ఆపే సంస్కృతి బిజెపికి లేదని తీవ్రంగా ఖండించిన కిషన్ రెడ్డి కేంద్ర మంత్రులతో జరిపిన భేటీలలో ముఖ్యమంత్రి ఆడుతున్న అబద్ధాలను బహిర్గతం కావించారు. జపాన్ ప్రభుత్వం సహకరిస్తామని చెప్తున్నా వారితో ఒప్పందం కుదుర్చుకోలేకపోవడం రేవంత్ అసమర్థత, అడ్మినిస్ట్రేటివ్ ఫెయిల్యూర్‌కు నిదర్శనం కాదా? అని కేంద్రం అసహనం వ్యక్తంచేసినట్టు తెలిసింది.

ప్రభుత్వం మెట్రో రైల్ ప్రాజెక్టుల్లో అనేకసార్లు మార్పులు చేస్తున్నా, డీపీఆర్ సరిగ్గా సమర్పించకపోయినా వాటిని స్వీకరిస్తూ రాష్ట్రానికి నిర్మాణాత్మక సలహాలు, సహకారాన్ని అందించామని కేంద్రం వెల్లడించింది. అయినా సీఎం రేవంత్‌రెడ్డి ఐఆర్ఎఫ్‌సీ గురించి, ఎల్అండ్‌టీ–ఐఆర్ఎఫ్‌సీ ఒప్పందం గురించి పచ్చి అబద్ధాలు ప్రచారం చేస్తున్నారని, జపాన్ ప్రభుత్వం నుంచి మెట్రో ప్రాజెక్టుకు నేరుగా రుణం వచ్చిందని చెప్పడం పూర్తిగా అబద్ధమని కేంద్రం కడిగిపారేసినట్టు తెలిసింది. హైదరాబాద్ మెట్రో ప్రాజెక్టు ఫేజ్–1కు వయబిలిటీ గ్యాప్ ఫండింగ్ కింద ఇప్పటివరకు రూ.1,204 కోట్లు ఇచ్చామని, కానీ.. ఫేజ్–1, ఫేజ్–2 విషయంలో కాంగ్రెస్ సర్కార్ అనుసరిస్తున్న తీరు తన అసమర్థ విధానాలను ప్రతిబింబిస్తున్నదని కేంద్రం ఆగ్రహం వ్యక్తం చేసినట్టు తెలిసింది.

ఫేజ్–2 విషయంలో తర్జనభర్జనలు జరుగుతున్న సమయంలోనూ చొరవ తీసుకొని రెండు ప్రత్యామ్నాయాలను సూచించినట్టు తెలిపింది. రూ.10 వేల కోట్లు తక్కువ ఖర్చయ్యేలా ఆర్ఆర్‌టీఎస్ ఫార్ములాను సూచించామని, దీనికి రాష్ట్ర ప్రభుత్వం ఒప్పుకోలేదని తెలిపింది. రాష్ట్రం చెప్పిన ఫార్ములా ప్రకారం సహకరించేందుకు అంగీకరించినా

# మీనాక్షీ నటరాజన్‌కు వెన్నుపోటుపై తెలంగాణ కాంగ్రెస్ అతలాకుతలం

● ప్రవీణ్

తెలంగాణ కాంగ్రెస్ వ్యవహారాల ఇంఛార్జ్ మీనాక్షీ నటరాజన్ రాజ్యసభ నామినేషన్ తిరసరణ వ్యవహారం కాంగ్రెస్ పార్టీలో కలకలం రేపుతున్నది. ఆమెపై క్రిమినల్ కేసు వ్యవహారంలో కోర్టు నోటీసులు ఉన్నాయని లీకులు ఇచ్చింది తెలంగాణ కాంగ్రెస్ నాయకులేనని మధ్యప్రదేశ్ మంత్రి కైలాష్ విజయ్ వర్గీయ పేల్చిన బాంబుకు ఏఐసీసీ నేతలు కకావికలం అయ్యారు. కుట్రకు మూలం ఎక్కడ? ఈ పని ఎవరు చేశారు? ఎందుకు చేశారు? అని ఢిల్లీ కాంగ్రెస్ వార్‌రూంలో చర్చలు జజరిగినా ఫలితం లేకపోయింది. తెలంగాణ కాంగ్రెస్ నేతలే తనకు వెన్నుపోటు పొడిచారని మీనాక్షీ నటరాజన్ స్వయంగా కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీతో చెప్పినట్టు తెలిసింది. నామినేషన్ పత్రాల వ్యవహారాలు చూసుకొనేందుకు పార్టీ లీగల్ సెల్ ఉన్నప్పటికీ, తనకు సహకారం అందకుండా చేశారని ఆవేదన వ్యక్తం చేసినట్టు సమాచారం. కోవర్టు రాజకీయాల వల్లే ఈ అంశం మధ్యప్రదేశ్ దాకా వెళ్లిందని, ఇదంతా తన వ్యక్తిగత అభిప్రాయం అని చెప్పినట్టు తెలిసింది.

మీనాక్షి ఫిర్యాదు నేపథ్యంలోనే తనను కలిసిన తెలంగాణ కాంగ్రెస్ నేతల మీద రాహుల్ సీరియస్ అయినట్టు తెలిసింది. అయితే పార్టీ పరువు కాపాడటం కోసం కాంగ్రెస్ లో వారెవ్వరి ప్రమేయం లేదని, అంతా బిజెపి జరిపిన కుట్ర అంటూ ఆమె హైదరాబాద్ మీడియా సమావేశంలో మేకపోతు గాంభీర్యాన్ని ప్రకటించారు. ఈ వ్యవహారంపై టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ స్పందిస్తూ దీని వెనుక అసలేం జరిగిందనే కోణంలో ఇప్పటికే అంతర్గత విచారణ ముమ్మరంగా సాగుతున్నదని తెలిపారు. పార్టీ అంతర్గత సమాచారం, వ్యూహాలను బయటకు చేరవేస్తున్న వారిపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ కాంగ్రెస్‌లో ఉంటూనే ప్రతిపక్షాలకు మేలు చేస్తున్న కోవర్టులెవరో గుర్తించే పనిలో నాయకత్వం ఉందని స్పష్టం చేశారు. 'ఈ వ్యవహారంలో లీకుల వీరులు ఎవరో? గ్రీకువీరులు ఎవరో త్వరలోనే బయటపడుతుంది' అని హెచ్చరించారు. తన ప్రభుత్వ వ్యవహారాలపై తరచూ పార్టీ అధిష్టానానికి ఫిర్యాదులు చేస్తున్న మీనాక్షి నటరాజన్‌తో ముఖ్యమంత్రి సంబంధాలు అంతంతమాత్రంగానే ఉంటుండడంతో ఈ విషయమై అధిష్టానం సీరియస్ గా

రేవంత్ ఎందుకు అసహనం ప్రదర్శిస్తున్నాడో అర్థం కావడం లేదని పేర్కొన్నది. కాగా రేవంత్ సీఎం కాకముందు నుంచే తాను హైదరాబాద్ మెట్రో కోసం ప్రయత్నాలు చేస్తున్నట్టు కిషన్ రెడ్డి ఓ ప్రకటనలో వెల్లడించారు. కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ మంత్రిని పలుమార్లు కలిసి నివేదికలు అందజేసినట్టు తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య సమన్వయం కోసం తెలంగాణ ప్రభుత్వం తరపున అధికారులను త్వరగా నామినేట్ చేయాలని, తద్వారా ప్రక్రియ ఆలస్యం కాకుండా మెట్రో విస్తరణ వేగవంతం అవుతుందని సీఎం రేవంత్ రెడ్డికి సూచించానని వివరించారు. కానీ తనపై ముఖ్యమంత్రి తప్పుడు ఆరోపణలు చేస్తూ అసత్యాలు ప్రచారం చేస్తున్నారని పేర్కొన్నారు.

భారతదేశంలో మౌలికవసతుల ప్రాజెక్టులకు జపాన్ 25 ఏండ్లుగా సంపూర్ణ సహకారం అందిస్తున్నది. ఢిల్లీ మెట్రోలో జైకా మొట్టమొదటిసారిగా భారీగా పెట్టుబడులు పెట్టింది. 2002లో నాటి ప్రధాని వాజ్ పేయి 8.3 కిలోమీటర్ల ఢిల్లీ మెట్రో ఫస్ట్ సెక్షన్ (రెడ్ లైన్– 6 స్టేషన్లు)ను ప్రారంభించారు. ఈ ప్రాజెక్టుకు జపాన్ రూ.55 వేల కోట్ల రుణాన్ని మంజూరు చేసింది. 2026లో జపాన్ ప్రభుత్వం అఫీషియల్ డెవలప్మెంట్ అసిస్టెన్స్ (ఓడీఏ) రుణాలు ఇచ్చింది. బెంగళూరు ఫేజ్–3 మెట్రోకు రూ.6,100 కోట్లు, ముంబై మెట్రో లైన్ 11 ప్రాజెక్టు–1కు రూ.5,500 కోట్లు ఇచ్చింది. ఇది కాకుండా చెన్నై మెట్రో, అహ్మదాబాద్ మెట్రోకు కూడా జపాన్ ప్రభుత్వం సహకరిస్తున్నది. తమకు కూడా జపాన్ బ్యాంకు డబ్బులిస్తున్నదని రేవంత్ పలు సందర్భాల్లో చెప్పుకొచ్చారు. కానీ అసలు విషయం ఏంటంటే జపాన్ ప్రభుత్వం సహకరిస్తామని చెప్తున్నా వారితో ఒప్పందం కుదుర్చుకోలేకపోవడం రేవంత్ అసమర్థత, అడ్మినిస్ట్రేటివ్ ఫెయిల్యూర్‌కు నిదర్శనం కాదా? అనే విమర్శలు చెలరేగుతున్నాయి.■

ఉన్నట్లు భావిస్తున్నారు.

గాంధీ భవన్ అడ్రస్ మీదే మీనాక్షికి కోర్టు నోటీసులు వచ్చినా, వాటిని గోప్యంగా ఎందుకు ఉంచారు? కేసు వివరాలను దాచిపెట్టడంలో ఉద్దేశం ఏమిటి? నిరుడు మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి మోహన్ యాదవ్ తెలంగాణకు రావడం, ఇక్కడి ముఖ్యనేతలను కలవడానికి ప్రత్యేకమైన కారణాలేం ఉన్నాయి? అంటూ లోతుగా శోధిస్తున్నారు. ప్రజాప్రతినిధుల చట్టం ప్రకారం నామినేషన్ పత్రాల్లో పోలీసు, కోర్టు కేసులు వెల్లడించాల్సి ఉంటుందనే విషయం తెలిసి కూడా, పోలీస్ క్లియరెన్స్ తీసుకోకుండా నిర్లక్ష్యంగా ఉండటం ఏమిటి? ఈ ప్రశ్నలకు సమాధానాలు చెప్పుకోలేక కాంగ్రెస్ నేతలు తలలు పట్టుకుంటున్నారు.

### కాంగ్రెస్ లో కోవర్ట్ ఎవరు?

మీనాక్షి నటరాజన్‌పై ఉన్న కేసును బయటపెట్టిన కాంగ్రెస్ కోవర్టు ఎవరు? అంటూ బిజెపి జాతీయ సంస్థాగత ప్రధాన కార్యదర్శి బీఎల్ సంతోష్ 'ఎక్స్' వేదికగా ప్రశ్నించారు. దేశవ్యాప్తంగా కాంగ్రెస్ నాయకులు, ఆ పార్టీ మద్దతుదారులు మీనాక్షీ నటరాజన్ అంశంపై బిజెపి మీద ఆరోపణలు చేస్తున్నారని, అయితే తెలంగాణలో నమోదైన కేసును పబ్లిక్ డొమైన్‌లోకి తీసుకొచ్చిందెవరు? అని ఆయన ప్రశ్నించారు. ముందు కాంగ్రెస్‌లోని కోవర్టులను పట్టుకొని పరిస్థితులు చక్కదిద్దుకోవాలని కాంగ్రెస్ పార్టీకి ఆయన హితవు పలికారు. మీనాక్షీ నటరాజన్ రాజ్యసభ నామినేషన్ తిరస్కరణ వ్యవహారంలో ఆమెపై కేసు వివరాలను చాటుగా సీఎం రేవంత్ రెడ్డే ఇచ్చి ఉండొచ్చని బిజెపి ఎంపీ డి. అర్వింద్ అనుమానం వ్యక్తంచేశారు. 'తెలంగాణలో మీనాక్షీ నటరాజన్‌పై కేసు ఉన్నదని ఎలక్షన్ కమిషన్‌కు కల ఏమైనా వచ్చిందా?' అంటూ ఎద్దేవా చేశారు. ఇది కాంగ్రెస్ కుట్రనా? రేవంత్ కుట్రనా? అనేది ఆ పార్టీ విచారణ చేయించుకోవాలని సూచించారు. మహిళకు రాజ్యసభ సీటిస్తే బిజెపి అడ్డుకుంటున్నదని మంత్రి సీతక్క ఆరోపిస్తున్నారు కదా? అని ప్రశ్నించగా మీనాక్షి నామినేషన్‌ను నితిన్ నబీన్ నింపాడా? అని ఎదురు ప్రశ్నించారు. మరోవంక, మీనాక్షీనటరాజన్ నామినేషన్ తిరస్కరణ వెనుక ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కుట్ర కోణం దాగి ఉన్నదంటూ సోషల్ మీడియాలో ప్రచారం చేస్తున్నారంటూ సీసీఎస్ పోలీసులకు భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి ఫిర్యాదు చేశారు. ఈ అంశంపై పలు మీడియాసంస్థలు కాంగ్రెస్ నుంచే బిజెపికి లీకులు వెళ్లాయని వార్తలు రాశాయి.

### ఇంతకీ ఏమిటా కేసు?

నారాయణపేట కాంగ్రెస్ నేతపై ఉన్న లైంగిక ఆరోపణల కేసులే మీనాక్షి మెడకు చుట్టుకున్నట్టు తెలిసింది. ఓ మహిళను లైంగిక వేధింపులకు గురి చేయడంతో పాటు చంపుతానని బెదిరించిన వ్యవహారంలో నారాయణపేట జిల్లా మాజీ డీసీసీ అధ్యక్షుడు శివకుమార్‌రెడ్డిపై ఒక మహిళా కాంగ్రెస్ నాయకురాలు ఫిర్యాదు చేశారు. శివకుమార్ రెడ్డి మీద 2022 మే 7న పంజాగుట్ట పోలీస్‌స్టేషన్‌లో, 2023 జూన్ 28న బెంగళూరులోని కుబ్బన్ పోలీస్‌స్టేషన్‌లో వేధింపుల కేసులు నమోదయ్యాయి. అతడిని అరెస్టు చేయాలంటూ సదరు మహిళ పంజాగుట్ట పోలీస్ స్టేషన్ వద్ద నిరసనకు దిగారు. ముందస్తు బెయిల్ కోసం శివకుమార్ రెడ్డి చేసిన ప్రయత్నాలు విఫలమయ్యాయి. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఆయనను ఎన్నికల కౌంటింగ్ ఏజెంట్‌గా నియమించింది. ఆయన మేనకోడలికి టికెట్ ఇచ్చింది. ఈ నేపథ్యంలో నారాయణపేట ఎమ్మెల్యే పర్ణికా రెడ్డి, శివకుమార్ రెడ్డి ఒకే వేదిక మీద కూర్చున్న వీడియోలు సంపాదించి, ఆయనపై చర్యలు తీసుకోవాలని సదరు మహిళ మీనాక్షి నటరాజన్ వద్దకు వెళ్ళింది. శివకుమార్ రెడ్డిని ఇప్పటికే పార్టీ నుంచి సస్పెండ్ చేశామని చెప్పినట్టు సమాచారం. ఈ సమాధానంపై సంతృప్తి చెందని సదరు మహిళ కోర్టును ఆశ్రయించి, మీనాక్షిని కూడా తన పిటిషన్‌లో ప్రతివాదిగా చేర్చారు. ■



జూన్ 16న రానున్న ఖరీఫ్ సీజన్ 2026కు సంబంధించి సమగ్ర వ్యవసాయ కార్యాచరణ ప్రణాళిక విడుదల చేసేలా, రైతులకు ఇచ్చిన హామీలను పూర్తి స్థాయిలో అమలు చేసేలా, పెండింగ్‌లో ఉన్న రైతు భరోసా బకాయిలను విడుదల చేసేలా, నకిలీ విత్తనాల నియంత్రణకు కఠిన చర్యలు తీసుకునేలా రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించాలని కోరుతూ గవర్నర్ శివప్రతాప్ శుక్లాకు వినతిపత్రం సమర్పించిన కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు బస్వాపురం లక్ష్మినర్సయ్య నేతృత్వంలోని బృందం, చిత్రంలో కిసాన్ మోర్చా నాయకులు గోలి మధుసూదన్ రెడ్డి, పడమటి జగన్మోహన్ రెడ్డి తదితరులు

# ఘనంగా "నమో జెన్z కాన్క్లేవ్"

రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను, ప్రజావ్యతిరేక విధానాలను ప్రశ్నించేందుకు యువత పెద్ద ఎత్తున ముందుకు రావాలని బిజెపి తెలంగాణ అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు పిలుపునిచ్చారు. రాబోయే రోజుల్లో రాష్ట్రవ్యాప్తంగా ఒక బలమైన యువజన ఉద్యమాన్ని నిర్మించాల్సిన అవసరం ఉందని అన్నారు. నేటి యువతకు విద్యా నైపుణ్యాలతో పాటు రాజకీయ చైతన్యం, అవగాహన కూడా ఎంతో అవసరమన్నారు. రాష్ట్రంలో యువత హక్కుల కోసం, ఉద్యోగాల కోసం, పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ తక్షణ విడుదల కోసం బిజెపి తరపున రాజీలేని పోరాటం చేస్తామని, ఈ పోరాటంలో యువతకు బిజెపి ఎల్లప్పుడూ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. అందరం కలిసికట్టుగా కాంగ్రెస్ ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలను ఎండగట్టాలని పిలుపునిచ్చారు.

భారతీయ జనతా యువ మోర్చా (బీజేవైఎం) తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు గణేష్ కుండే ఆధ్వర్యంలో "నమో జెన్Z కాన్క్లేవ్" జూన్ 23న హైదరాబాద్ బాగ్ లింగంపల్లిలోని RTC కళాభవన్ లో ఘనంగా జరిగింది. బిజెపి తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు, బిజెపి శాసనసభా పక్ష నాయకులు ఏలేటి మహేశ్వర్ రెడ్డి, పార్లమెంట్ సభ్యులు ఈటెల రాజేందర్, ఎమ్మెల్యే పాల్వాయి హరీష్ బాబు, ఎమ్మెల్సీ అంజిరెడ్డి పాల్గొని యువతకు మార్గదర్శనం చేశారు. ఈ కార్యక్రమంలో వక్తలు మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో గత 12 సంవత్సరాలుగా దేశంలో చోటుచేసుకున్న అభివృద్ధి, యువత సాధికారత, స్టార్టప్‌లకు ప్రోత్సాహం, ఉద్యోగ ఉపాధి అవకాశాల కల్పన, డిజిటల్





ఇండియా, స్కిల్ ఇండియా, స్టార్టప్ ఇండియా వంటి కార్యక్రమాల ద్వారా యువతకు లభించిన అవకాశాల గురించి వివరించారు. యువత దేశ నిర్మాణంలో కీలక పాత్ర పోషించాలని, అభివృద్ధి చెందిన భారతదేశ నిర్మాణంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. అలాగే మోదీ ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు యువత జీవితాల్లో తీసుకొచ్చిన మార్పులపై విస్తృత చర్చ జరిగింది.

ఈ కార్యక్రమంలో ఎన్. రాంచందర్ రావు ప్రసంగిస్తూ.. జాతి నిర్మాణంలో యువత పాత్ర అత్యంత కీలకమని, క్రమశిక్షణతో కూడిన సమయ పాలన, దేశభక్తి కలిగిన యువతతోనే నవభారత నిర్మాణం సాధ్యమవుతుందని స్పష్టం చేశారు. విద్య అనేది కేవలం ఒక ఉద్యోగం కోసం మాత్రమే కాదని, కేవలం ప్రొఫెషనల్ కోర్సుల వెనుకే పరుగెత్తకుండా విద్యార్థులు తమకు నచ్చిన బీఏ, బీఎస్సీ, బీఈడ్, ఎమ్మెస్సీ వంటి సంప్రదాయ కోర్సులను కూడా ఎంచుకోవాలన్నారు. ఎంతో మంది మహానుభావులు సాధారణ కోర్సులు చదివే దేశంలో ఉన్నత స్థానాలకు ఎదిగారని ఉదహరించారు. యువతకు నచ్చిన రంగంలో వైవిధ్యమైన నైపుణ్యాలు ప్రదర్శిస్తూ ముందుకు సాగాలని హితవు పలికారు.

ఈ కార్యక్రమంలో బీజేవైఎం రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు జి. హరీశ్వర్ రెడ్డి, మల్కా యశస్వి, రాష్ట్ర ఉపాధ్యక్షులు ప్రవీణ్ రెడ్డి, సందీప్ గౌడ్, నితిన్ నందకర్, అనితా రెడ్డి, శరత్ చంద్ర, సాయినాథ్, రాష్ట్ర కార్యదర్శులు శివచంద్రగిరి, వరప్రసాద్ రెడ్డి, అరవింద్ రెడ్డి, హరిప్రసాద్, ప్రదీప్ రావు, ఝాన్సీ, కోశాధికారి నరేన్ దేశ్‌పాండే తో పాటు బీజేవైఎం రాష్ట్ర పదాధికారులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

–జనసందేశ్ ప్రతినిధి


ప్రతి అల వెనుక సముద్రమంతా ఆధారంగా నిలిచి ఉన్నది: స్వామి వివేకానంద

# బస్తర్‌లో 12 ఏళ్ల శాంతి, పురోగతుల ప్రస్థానం


విష్ణు దేవ్ సాయి

ఛత్తీస్‌గఢ్ ముఖ్యమంత్రి




ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పాలన భారతదేశంలో పెను మార్పులను తీసుకువచ్చింది. దేశ భద్రత, అభివృద్ధి పరంగా ఇదొక సువర్ణ అధ్యాయం. భద్రత, రహదారులు, విద్యుత్, గృహనిర్మాణం, డిజిటల్ సేవలు, సంక్షేమ పథకాలలో దేశం గణనీయమైన పురోగతిని సాధించింది. బలమైన నాయకత్వం దేశాన్ని ఆత్మవిశ్వాసంతో ముందుకు నడిపించడంలో సహాయపడింది. ఛత్తీస్‌గఢ్‌కు ఇది ఒక కీలకమైన మార్పు. గతంలో బస్తర్, ఇతర గిరిజన ప్రాంతాలు నక్సలైట్ హింస, అధ్వాన రహదారులు, ప్రాథమిక వసతుల లేమికి మారుపేరుగా ఉండేవి. నేడు మెరుగైన భద్రత, రోడ్లు, సంక్షేమ పథకాలతో పరిస్థితి మెరుగుపడుతోంది, ఇది కొత్త ఆశలను చిగురింపజేస్తోంది.

దశాబ్దం క్రితం భారతదేశం ఉగ్రవాదాన్ని, వామపక్ష తీవ్రవాదాన్ని ఎదుర్కొంది. ఈ సవాళ్లను అధిగమించేందుకు ప్రభుత్వం కఠినమైన చర్యలు చేపట్టింది. అధికరణం 370 రద్దు జాతీయ ఐక్యతను బలోపేతం చేసింది. నక్సలిజానికి వ్యతిరేకంగా చేపట్టిన చర్యలు బస్తర్‌తో సహా పలు ప్రాంతాలలో హింసను తగ్గించాయి, తద్వారా నిర్లక్ష్యానికి గురైన ప్రాంతాలలో సైతం అభివృద్ధి ప్రారంభమైంది. బస్తర్‌లో 'నియాద్ నెల్లానార్ యోజన' కింద 17 శాఖలకు చెందిన 43 పథకాల ప్రయోజనాలు భద్రతా క్యాంపుల సమీపంలోని 525 గ్రామాలకు అందుతున్నాయి. మెరుగైన సేవలు అందించడం కోసం ఈ క్యాంపులను 'వీర్ షహీద్ గుండంధూర్ సేవా డేరా'లుగా మారుస్తున్నారు. గడిచిన 12 ఏళ్లలో గిరిజన ప్రాంతాలకు అభివృద్ధిని తీసుకురావడంలో కేంద్ర ప్రభుత్వ పథకాలు కీలక పాత్ర పోషించాయి. 'పీఎం ఆవాస్ యోజన' కింద ఛత్తీస్‌గఢ్‌లో 2.43 లక్షల పట్టణ గృహాలు మంజూరవగా, 2.16 లక్షల ఇళ్ల నిర్మాణం పూర్తయింది. 'పీఎం జన్ మన్ యోజన' బాగా వెనుకబడిన గిరిజన సమూహాలకు గృహాలు, రహదారులు, వైద్యం, విద్యను అందిస్తూ మద్దతుగా నిలుస్తోంది. 'ధర్తీ ఆబా' కార్యక్రమం గిరిజన గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలలు, స్థానిక సేవలను మెరుగుపరుస్తోంది.

'స్వస్థ బస్తర్' ప్రచారం కింద 36 లక్షల మందికి ప్రాథమిక పరీక్షలు చేసి 4.96 లక్షల మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు, 5,600 మందిని ఉన్నతస్థాయి ఆస్పత్రులకు పంపించారు. 'మహాతరి వందన్ యోజన' ద్వారా 69 లక్షల మంది మహిళలు నెలకు రూ.1,000 చొప్పున ఆర్థిక సహాయాన్ని పొందుతున్నారు, దీని కింద ఇప్పటివరకు రూ.17,500 కోట్లకు పైగా నిధులు బదిలీ అయ్యాయి. 'పీఎం–కిసాన్' రైతన్నలకు అండగా నిలుస్తోంది. 'కృషక్ ఉన్నతి యోజన' కింద ఖరీఫ్ మార్కెటింగ్ సీజన్ 2025–26లో 1.41 కోట్ల మెట్రిక్ టన్నుల వరిని రూ.33,431 కోట్ల మద్దతు ధర, రూ.10,324 కోట్ల పెట్టుబడి ఆర్థిక సాయం అందించి సేకరించడం జరిగింది. 'పీఎం సూర్య ఘర్' కింద 61,000 ఇళ్లకు రూఫ్‌టాప్ సోలార్ వ్యవస్థలను ఏర్పాటు చేశారు, ఇది ఖర్చులను తగ్గించడమే కాకుండా స్వచ్ఛమైన ఇంధన ఉత్పత్తిని ప్రోత్సహిస్తోంది. సింగిల్–విండో విధానం వ్యాపారాల నిర్వహణను సులభతరం చేస్తూ (ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్) పెట్టుబడి వాతావరణాన్ని మెరుగుపరిచింది.

'బస్తర్ ఒలింపిక్స్', 'బస్తర్ పండుమ్' గిరిజన సంస్కృతిని ప్రోత్సహిస్తున్నాయి. చిత్రకూట్‌ను ఒక ప్రధాన పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేస్తుండటం వల్ల స్థానికంగా ఉపాధి అవకాశాలు లభిస్తున్నాయి. ప్రత్యక్ష నగదు బదిలీ ద్వారా లబ్ధిదారులకు ఎలాంటి ఆలస్యం లేదా అవినీతి లేకుండా నేరుగా నిధులు అందుతున్నాయి. సుదూర గ్రామాల్లో మొబైల్ కనెక్టివిటీ, ఇంటర్నెట్ సౌకర్యాలు పెరగడం వల్ల ప్రజలు ప్రభుత్వ సేవలను సులభంగా పొందగలుగుతున్నారు. స్వయం సహాయక సంఘాలు, అటవీ ఆధారిత జీవనోపాధి, సహకార నమూనాల ద్వారా బస్తర్ సామాజిక, ఆర్థిక మార్పులను చూస్తోంది. చిన్నతరహా అటవీ ఉత్పత్తుల సేకరణ, వాటికి విలువ జోడింపు ద్వారా గిరిజన కుటుంబాల ఆదాయం

# కాంగ్రెస్ సర్కార్ వైఫల్యాలను రాహుల్ దృష్టికి తీసుకెళ్తాం!

## అపాయింట్‌మెంట్ ఇప్పించాలంటూ రేవంత్ రెడ్డికి రాంచందర్ రావు లేఖ

తెలంగాణ ప్రజలకు ఇచ్చిన హామీలు, నెరవేరని గ్యారంటీలపై లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీకి వినతి పత్రాన్ని సమర్పించేందుకు ఆయన అపాయింట్‌మెంట్ ఇప్పించాలని కోరుతూ జూన్ 21న తెలంగాణ బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి గారికి బహిరంగ లేఖ రాశారు. 2023 అసెంబ్లీ ఎన్నికల సమయంలో రాహుల్ గాంధీ, సోనియా గాంధీ, ప్రియాంక గాంధీ వ్యక్తిగతంగా ఇచ్చిన హామీలు, గ్యారంటీల ఆధారంగానే తెలంగాణ ప్రజలు కాంగ్రెస్ పార్టీపై నమ్మకం ఉంచారని, రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడినప్పటికీ మహిళలు, రైతులు, విద్యార్థులు, యువత, వృద్ధులు, వ్యవసాయ కార్మికులు, పేద కుటుంబాలకు ఇచ్చిన పలు కీలక హామీలు ఇంకా నెరవేరని విషయాన్ని లేఖలో పేర్కొన్నారు. నెలకు రూ.2,500 అందుతుందని ఆశించిన మహిళలు ఆర్థిక సహాయం కోసం ఇంకా ఎదురుచూస్తున్నారని, అలాగే రైతు భరోసా కింద ఎకరాకు రూ.15,000 లభిస్తుందని రైతులు ఇంకా వేచి చూస్తూనే ఉన్నారని రాంచందర్ రావు పేర్కొన్నారు. కౌలు రైతులు, రైతు కూలీలు, ఇందిరమ్మ ఇండ్ల కోసం ఎదురుచూస్తున్న పేద కుటుంబాలకు కూడా నిరాశే ఎదురవుతోందని అన్నారు.

విద్యార్థులు, యువత పడుతున్న ఇబ్బందులను ప్రస్తావిస్తూ, విద్యా భరోసా పథకం కింద ఇస్తామన్న రూ.5 లక్షల సహాయం ఇంకా కార్యరూపం దాల్చలేదని అన్నారు. ఇచ్చిన గ్యారంటీలను అమలు చేయడంలో కాంగ్రెస్ ఘోరంగా విఫలమైందని, దీనివల్ల తెలంగాణ వ్యాప్తంగా ప్రజల్లో తీవ్ర అసంతృప్తి, నిరాశ పెరుగుతోందని రాంచందర్ రావు చెప్పారు. తెలంగాణ ప్రజల ఆందోళనలను, సమస్యలను నేరుగా రాహుల్ దృష్టికి తీసుకెళ్లేందుకు వీలుగా, వీలైనంత త్వరగా ఆయనతో అపాయింట్‌మెంట్ కల్పించాలని రేవంత్ రెడ్డిని ఆయన కోరారు. ఒకవేళ కాంగ్రెస్ నాయకత్వం స్పందించడంలో, అపాయింట్‌మెంట్ కల్పించడంలో విఫలమైతే, అది తెలంగాణకు, ఇక్కడి ప్రజలకు కాంగ్రెస్ చేసిన తీవ్ర ద్రోహానికి నిదర్శనమని రాంచందర్ రావు లేఖలో స్పష్టం చేశారు.

**–జనసందేశ్ ప్రతినిధి**

---

పెరుగుతోంది. 'అగ్రిస్ట్యాక్', 'ఫార్మర్ రిజిస్ట్రీ' వంటి డిజిటల్ వ్యవసాయ కార్యక్రమాలు పారదర్శకతను పెంచుతూ, సబ్సిడీల పంపిణీలో ఆలస్యాన్ని తగ్గిస్తున్నాయి. రైతులు ఇప్పుడు పంట బీమా, కనీస మద్దతు ధర ప్రయోజనాలు, భూసార సమాచారాన్ని మరింత సమర్థంగా పొందగలుగుతున్నారు. నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు యువతను జాతీయ, అంతర్జాతీయ అవకాశాలకు సిద్ధం చేస్తున్నాయి. ఐటీ, ఏఐ వంటి నూతన రంగాలలో శిక్షణ ఇవ్వడం వల్ల యువత ఉద్యోగాలకు అర్హులుగా మారుతున్నారు. మెరుగైన రహదారులు, విద్యుదీకరణ, తాగునీటి సరఫరా వంటివి గతంలో వెనుకబడిన గ్రామాలలో ప్రాథమిక అవసరాలను తీరుస్తున్నాయి. ప్రభుత్వ పథకాలు పట్టణ, గ్రామీణ ప్రాంతాల మధ్య ఉన్న అసమానతలను తగ్గిస్తున్నాయి.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఉమ్మడి వ్యూహాల ప్రభావం బస్తర్‌లోని ప్రతి రంగంలోనూ స్పష్టంగా కనిపిస్తోంది. ఇది నేడు ఒక పరివర్తన నమూనాగా ఎదుగుతోంది. పాలనపై ప్రజల్లో నమ్మకం పెరిగింది, పౌరుల చురుకైన భాగస్వామ్యం కనిపిస్తోంది, భవిష్యత్తుకై అవకాశాలు మెరుగవుతున్నాయి. భారతదేశం 'వికసిత్ భారత్ 2047' వైపు అడుగులు వేస్తున్న తరుణంలో, అభివృద్ధి ఫలాలు ప్రతి పౌరుడికీ అందేలా చూసేందుకు ఛత్తీస్‌గఢ్ నిరంతరం కృషిచేస్తోంది. లక్ష్య ఆధారిత పాలన, సంక్షేమ పథకాల సమర్థ అమలు ద్వారా ఎంతటి దుర్గమ ప్రాంతాలలోనైనా జీవితాలను ఎలా మార్చవచ్చో, అందరికీ సురక్షితమైన, ఆశాజనకమైన భవిష్యత్తును ఎలా అందించవచ్చో బస్తర్ లో మారిన పరిస్థితి నిరూపిస్తోంది. ఈ పురోగతి నిరంతర కృషి, బలమైన నాయకత్వం, ప్రజలే కేంద్రంగా సాగే విధానాలు, వివిధ ప్రభుత్వ స్థాయిల మధ్య సమన్వయంతో కూడిన అమలు ఫలితం. ■

# సరికొత్త పాలనా సంస్కరణలకు తెరతీసిన మోదీ శకం



**తరణ్ జిత్ సింగ్ సంధు**
ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్, మాజీ దౌత్యవేత్త

చరిత్ర ఎప్పుడూ ఒకే సరళరేఖలో సాగదు. ప్రతి తరమూ తనదైన సవాళ్లను ఎదుర్కొంటుంది, కాలానికి అనుగుణంగా పరిష్కారాలను వెతుక్కుంటుంది. 1947లో భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చినప్పుడు, తీవ్రమైన వనరుల కొరత ఉన్నప్పటికీ ప్రజాస్వామ్య వ్యవస్థలను స్థాపించడం, విస్తృతమైన, వైవిధ్యభరితమైన జనాభాను ఏకం చేయడం, పరిపాలనా యంత్రాంగాన్ని నిర్మించడం, శాస్త్రీయ సామర్థ్యాలను పెంపొందించుకోవడం, ఆర్థిక వృద్ధి వైపు పయనించడం అప్పటి నాయకత్వం ముందున్న ప్రధాన అవసరాలు. అయితే, 2014 నాటికి సవాళ్ల స్వభావం మారింది. పరస్పరం అనుసంధానమైన నేటి ప్రపంచంలో, ప్రస్తుత వ్యవస్థలను 140 కోట్ల జనాభాకు మరింత బాధ్యతాయుతంగా, సమర్థంగా, అర్థవంతమైన ఫలితాలను అందించేలా మార్చడమే ఇప్పటి ప్రధాన సవాలుగా పరిణమించింది. అనేక విషయాల్లో చూస్తే వేగంగా మారుతున్న భారతదేశ ఆకాంక్షలకు అనుగుణంగా పరిపాలనను తీర్చిదిద్దడమే ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సాధించిన అతిపెద్ద విజయం.

గత దశాబ్ద కాలంలో ప్రపంచంలోనే అరుదుగా కనిపించే భారీ స్థాయి పాలనాపరమైన కార్యక్రమాలకు భారతదేశం వేదికైంది. ఇప్పటివరకు 56 కోట్లకు పైగా జన్ ధన్ ఖాతాలను ప్రారంభించారు. విశేషమేమిటంటే, ఈ ఖాతాలలో సగానికి పైగా మహిళలవే కావడం వల్ల వారికి ఆర్థిక అవకాశాలు మెరుగై వ్యక్తిగత సాధికారత బలోపేతమైంది. పారిశుధ్యం, గృహ వసతి, విద్యుత్, వైద్యం, స్వచ్ఛమైన వంట గ్యాస్ వంటి కనీస అవసరాలు ప్రజలందరికీ గణనీయంగా అందుబాటులోకి వచ్చాయి. ప్రధాని మోదీ నాయకత్వంలో డిజిటల్ సాంకేతికతలను కేవలం వినియోగించే స్థాయి నుంచి డిజిటల్ ప్రజా మౌలిక సదుపాయాలలో ప్రపంచ ఆవిష్కర్తగా భారతదేశం ఎదిగింది. ఆధార్ ఆధారిత సేవలు, యూపీఐ, కోవిన్ వంటి డిజిటల్ కార్యక్రమాలు సాంకేతికత ద్వారా పారదర్శకతను, సమ్మిళిత వృద్ధిని, సాధికారతను ఎలా సాధించవచ్చో నిరూపించాయి. రోడ్లు, రైల్వేలు, విమానాశ్రయాలు, ఓడరేవులు, లాజిస్టిక్స్ కారిడార్లు, డిజిటల్ అనుసంధానత రంగాల్లో పెట్టుబడులు అపూర్వమైన వేగంతో విస్తరించాయి. ఇక్కడ మౌలిక సదుపాయాల కల్పనను కేవలం ఒక అభివృద్ధి లక్ష్యంగానే కాకుండా, దేశ ప్రగతి, పెట్టుబడులు, పోటీతత్వం, జాతీయ సమగ్రతకు ఒక వ్యూహాత్మక పునాదిగా పరిగణిస్తున్నారు.

ఈ మార్పుల ప్రభావం అంతర్జాతీయంగా పెరుగుతున్న భారతదేశ ప్రతిష్ఠ రూపంలో స్పష్టంగా కనిపిస్తోంది, ఇందులో ప్రధాని మోదీ నాయకత్వం కీలక పాత్ర పోషించింది. నేడు భారతదేశం ఒక నమ్మకమైన ఆర్థిక భాగస్వామిగా, డిజిటల్ ఆవిష్కరణల్లో అగ్రగామిగా, అభివృద్ధి చెందుతున్న దేశాల బలమైన గొంతుకగా గుర్తింపు పొందింది. అంతేకాకుండా వాతావరణ చర్యలు, ఆరోగ్య సంరక్షణ, సరఫరా గొలుసు పునరుద్ధరణ, సరికొత్త సాంకేతికతలు, వ్యూహాత్మక స్థిరత్వం వంటి అంతర్జాతీయ చర్చల్లో కీలక పాత్ర పోషిస్తోంది. భారతదేశం విజయవంతంగా నిర్వహించిన జీ20 (G20) సారథ్యం, అభివృద్ధి చెందుతున్న దేశాల తరపున వినిపించిన వాదనలు, భవిష్యత్తు సాంకేతికతలను రూపొందించడంలో చూపుతున్న ప్రభావం దేశ స్థానాన్ని మరింత పటిష్ఠం చేశాయి.

భారత్ చాలా కాలంగా సీమాంతర ఉగ్రవాద సవాలును ఎదుర్కొంటోంది. దీనిపై గత ప్రభుత్వాలు సంయమనం, సంసిద్ధత, ప్రతిస్పందనల మధ్య సమతుల్యతను పాటించాల్సి వచ్చింది. అయితే ప్రధాని మోదీ హయాంలో రక్షణ సంసిద్ధత, బలమైన సరిహద్దు మౌలిక సదుపాయాలు, నిఘా ఆధారిత చర్యలు, దృఢమైన దౌత్యం, 'ఉగ్రవాదం – చర్చలు కలిసి సాగలేవు' అనే స్పష్టమైన సందేశంతో కూడిన దృఢమైన వ్యూహం వైపు అడుగులు పడ్డాయి. ఉరీ ఉగ్రదాడి తర్వాత 2016లో నియంత్రణ రేఖ వెంట చేపట్టిన సర్జికల్ స్ట్రైక్స్ భారతదేశ భద్రతా విధానంలో ఒక కీలక మలుపుగా

నిలిచాయి. సరిహద్దు అవతల ఉన్న ఉగ్రవాద స్థావరాలపై వ్యూహాత్మక దాడులు చేయడానికి తమకు ఉన్న సంకల్పాన్ని భారతదేశం నిరూపించుకుంది. పుల్వామా దాడి తర్వాత 2019లో జరిగిన బాలాకోట్ వైమానిక దాడి ఈ సందేశాన్ని మరింత బలంగా పంపింది. ఉగ్రవాదంపై భారతదేశ ప్రతిస్పందన పాత అంచనాలకు లేదా భౌగోళిక పరిమితులకు లోబడి ఉండదని ఇది స్పష్టం చేసింది. 'ఆపరేషన్ సింధూర్' ఉగ్రవాదాన్ని అంతమొందించే విషయంలో భారత్ పట్టుదలను, జాతీయ భద్రతకు ముప్పు వాటిల్లినప్పుడు దీటుగా స్పందించే సామర్థ్యాన్ని ప్రతిబింబించింది. ఈ దాడుల అనంతరం అమెరికా ఖండాల్లోని విధాన నిర్ణేతలు, చట్టసభ సభ్యులు, వ్యూహాత్మక నిపుణులు, ప్రజాభిప్రాయ నేతలతో చర్చలు జరిపిన పార్లమెంటరీ ప్రతినిధి బృందంలో భాగస్వామిని అయ్యే అవకాశం నాకు లభించింది. ఆ సమయంలో, ఉగ్రవాదాన్ని ఏ రకంగానూ సమర్థించలేమని, దానిని వర్గీకరించలేమని లేదా ప్రభుత్వ విధాన సాధనంగా ఉపయోగించలేమని భారతదేశం వాదించే విధానం పట్ల అంతర్జాతీయంగా అవగాహన పెరగడం స్పష్టంగా గమనించాను.

ప్రధాని మోదీ ఒక చారిత్రాత్మక మైలురాయిని అధిగమిస్తున్న తరుణంలో, దీని ప్రాధాన్యం కేవలం ఆయన పదవీకాలం నిడివిలో లేదు, ఆయన సాధించాలనుకున్న పరివర్తన పరిమాణంలో ఉంది. 'వికసిత్ భారత్ 2047' దార్శనికత కేవలం ఆర్థిక వృద్ధిని మాత్రమే కాకుండా, స్వాతంత్ర్యం వచ్చిన శతాబ్ది ఉత్సవాల నాటికి ఒక అభివృద్ధి చెందిన, సమ్మిళిత, నూతన ఆవిష్కరణలతో కూడిన, ప్రపంచాన్ని ప్రభావితం చేసే భారతదేశాన్ని నిర్మించాలనే ఆకాంక్షను ప్రతిబింబిస్తుంది. మోదీ యుగం పరిపాలన పరిధిని, స్థాయిని విస్తరించింది. ఇది ప్రభుత్వాన్ని మరింత బాధ్యతాయుతంగా, సాంకేతికతను సామాన్యుడికి అందుబాటులోకి, అభివృద్ధిని మరింత సమ్మిళితంగా, ప్రపంచంలో భారతదేశ స్థానం పట్ల మరింత ఆత్మవిశ్వాసాన్ని నింపేలా చేయడానికి కృషి చేసింది.



జూన్ 18న ఢిల్లీలోని బిజెపి కేంద్ర కార్యాలయంలో జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ ను మర్యాదపూర్వకంగా కలిసి, రాష్ట్ర కార్యవర్గ సమావేశాలకు ఆహ్వానించిన రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్ రావు



జూన్ 20న బిజెపి ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యులు డాక్టర్ కే. లక్ష్మణ్ కేంద్ర ప్రభుత్వం 12 సంవత్సరాల కాలంలో సాధించిన అభివృద్ధి, సంక్షేమ విజయాలను వివరించే పుస్తకాలను వివిధ బీసీ సామాజిక వర్గాల ప్రతినిధులకు పంపిణీలో భాగంగా కురుమ సామాజిక వర్గానికి చెందిన బాలస్వామి నివాసాన్ని సందర్శించి, వారి కుటుంబ సభ్యులతో కలిసి బంతి భోజనంలో పాల్గొన్నారు.



జూన్ 18న బిజెపి రాష్ట్ర కార్యాలయంలో రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు సమక్షంలో బిజెపిలో చేరిన పలువురు ప్రముఖులు



పంజాబ్ పర్యటనలో భాగంగా జూన్ 21న అమృత్ సర్ స్వర్ణ దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన బిజెపి జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్



● నాగార్జున

# మాలో ఒక్క మంత్రి మీదైనా అవినీతి ఆరోపణలు వచ్చాయా?

నీట్ పేపర్ లీకేజీ విషయంలో కేంద్ర విద్యా శాఖ మంత్రి రాజీనామా చేయాలనే డిమాండ్ కేవలం విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యల నుంచి రాజకీయ ప్రయోజనం పొందే ప్రయత్నం మాత్రమే అని కేంద్ర పార్లమెంటరీ, మైనారిటీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు అభిప్రాయం వ్యక్తం చేశారు. జరిగిన పొరబాటుకు తానే నైతిక బాధ్యత వహిస్తానని విద్యాశాఖ మంత్రి ప్రకటించారని, ఆయన బాధ్యత నుంచి పారిపోవడం లేదని వ్యాఖ్యానించారు. దానికి బదులుగా సమస్యను పరిష్కరించడాన్ని ఒక సవాలుగా తీసుకున్నారని తెలిపారు. యూపీఏ పాలనలో ప్రతి నెలా మంత్రులపై అవినీతి ఆరోపణలు వచ్చేవని, కానీ గత 12 ఏళ్లలో లంచాలు తీసుకున్నారని లేదా కమీషన్లు తీసుకున్నారని, వ్యవస్థను దుర్వినియోగం చేశారని ఏ మంత్రిపైనా ప్రత్యక్ష ఆరోపణలు రాలేదని తేల్చి చెప్పారు. ఉత్తరప్రదేశ్ వంటి ప్రాంతాలలో ఒక ఎమ్మెల్యే దాదాపు నాలుగు లక్షల మంది ప్రజలకు ప్రాతినిధ్యం వహిస్తున్నారని, ఇది యూరప్‌లోని 20 మంది ఎంపీలతో సమానమన్నారు. ఎన్నికైన ప్రతినిధి మొత్తం ప్రాంతాన్ని తిరగలేకపోతే లేదా ప్రజలను కలవలేకపోతే, అది ఒక లోపంగా మారుతుందని, దాన్ని సరిదిద్దాలని అన్నారు. సీజేపీ కేవలం కాంగ్రెస్ పార్టీకి మాత్రమే సవాలు విసురుతోందని, ఆందోళన చెందాల్సింది వారేనని స్పష్టం చేశారు. ఒక జాతీయ ఆంగ్ల దినపత్రికకు ఇచ్చిన ఇంటర్వ్యూలో కేంద్రమంత్రి కిరణ్ రిజిజు రాజ్యాంగ సవరణ బిల్లు ఆవశ్యకత, మైనారిటీలపై దాడులు, పార్లమెంటులో బిల్లులు ఆమోదం పొందకపోవడానికి గల కారణాలు, ప్రభుత్వం ఎదుర్కొంటున్న ప్రధాన సవాళ్ళపై మాట్లాడారు. ఇంటర్వ్యూలోని కొన్ని భాగాలు:

**ఎన్డీయే ప్రభుత్వం 12 ఏళ్ల పాలనను పూర్తి చేసుకున్న తరుణంలో ఇటీవల పార్లమెంటులో రాజ్యాంగ సవరణ బిల్లు వీగిపోయింది. దీనికి మీరు ముందే సిద్ధపడి ఉన్నారా?**

జ: మహిళా రిజర్వేషన్ బిల్లు వీగిపోవడం మాకు తీవ్ర అసంతృప్తిని, ఆవేదనను కలిగించింది.

**మహిళా రిజర్వేషన్ బిల్లు వీగిపోలేదు కదా.**

జ: దాని అమలు ప్రక్రియ వీగిపోయింది. మీరు దాన్ని రాజ్యాంగ (131వ సవరణ) బిల్లు అని పిలవవచ్చు, కానీ ప్రాథమికంగా అది లోక్‌సభ, అసెంబ్లీలలో మహిళా రిజర్వేషన్ల అమలుకు సంబంధించినది. ప్రతిపక్షాల వైఖరి రెండు కారణాల వల్ల ఊహించని విధంగా ఉండటంతో మేము తీవ్రంగా కలత చెందాం. మొదటిది, 2023లో అన్ని ప్రతిపక్ష పార్టీలు మద్దతు ఇచ్చిన 'నారీ శక్తి వందన్ అధినియం' బిల్లునే ఏకగ్రీవంగా ఆమోదించారు. 2026 తర్వాత జరిగే జనాభా గణన ఆధారంగానే ఈ బిల్లును అమలు చేస్తామని అప్పట్లో స్పష్టంగా పేర్కొన్నాం. అయితే కులాల వారీ జనాభా గణనకు చాలా సమయం పడుతుంది కాబట్టి, మనం 2011 జనాభా లెక్కలను ప్రాతిపదికగా తీసుకోవాల్సి ఉంటుంది. అందుకు రాజ్యాంగ సవరణ అవసరం. అది లేకుండా నారీ శక్తి వందన్ అధినియం బిల్లు అమలులో చేర్చాల్సిన అవసరమైన అంశాలను మనం చేర్చలేం. ఇక రెండో విషయానికొస్తే, ఈ బిల్లును మేము హఠాత్తుగా ఏమీ తీసుకురాలేదు, అన్ని పక్షాలతో, ముఖ్యంగా పెద్ద రాజకీయ పార్టీలతో సంప్రదింపులు జరిపాం. కాంగ్రెస్, తృణమూల్, ఆప్ మినహా మిగిలిన పార్టీలన్నీ మాతో చేతులు కలిపాయి, అంగీకరించాయి.

**మీరు అఖిలపక్ష సమావేశాన్ని ఏర్పాటు చేయలేదన్నది ప్రతిపక్షాల ప్రధాన వాదన. పైగా సమావేశాలకు రెండు రోజుల ముందే బిల్లును తెచ్చారని, ఇతర పార్టీలకు మీరు వాగ్దానం చేసిన 50 శాతం సీట్ల పెంపు గురించి ప్రస్తావించకుండా, కేవలం లోక్‌సభ సీట్ల సంఖ్యను మాత్రమే పేర్కొన్నారని వారు అంటున్నారు. మహిళా రిజర్వేషన్ల నుంచి దీన్ని వేరు చేస్తే తాము సిద్ధమేనని కాంగ్రెస్ చెప్పింది. దీనిపై మీరేమంటారు?**

జ: పార్లమెంట్ మొదటి విడత సమావేశాలు జరుగుతున్నప్పుడే మేము సంప్రదింపుల ప్రక్రియను ప్రారంభించాం. అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేయాలనే డిమాండ్ చాలా ఆలస్యంగా వచ్చింది. మల్లికార్జున్ ఖర్గే నాకు మూడు లేఖలు రాశారు. నేను అప్పటికే డిఎంకె, సమాజ్‌వాదీ పార్టీ, శివసేన వంటి మెజారిటీ రాజకీయ పార్టీలతో సంప్రదింపులు పూర్తి చేసిన తర్వాత... అఖిలపక్ష సమావేశాన్ని వాయిదా వేయాలని మొదటి లేఖలో డిమాండ్ చేశారు. సంప్రదింపుల ప్రక్రియ మొత్తం పూర్తయిన తర్వాత ఇక అఖిలపక్ష సమావేశాన్ని పిలవడంలో అర్థం ఏముంది? మేము 70 శాతం ప్రతిపక్ష పార్టీలను కలిశాం. ఆ తర్వాత కాంగ్రెస్ హఠాత్తుగా అఖిలపక్ష సమావేశాన్ని డిమాండ్ చేసింది, ఇది కేవలం ఒక ఎత్తుగడ మాత్రమే.

**మరి ఇకముందు ఏం చేయబోతున్నారు?**

జ: దీనిపై నేను ఇప్పుడు ఎలాంటి హామీ ఇవ్వలేను, ఎందుకంటే ఇది క్యాబినెట్ ముందుకు వచ్చి, అక్కడ నిర్ణయం జరిగే వరకు వేచి చూడాలి.

**సీబీఎస్ఈ మూల్యాంకనం, నీట్ పేపర్ లీకేజీ వల్ల చాలా మంది విద్యార్థులు నష్టపోయారు. ఈ విషయంలో ప్రభుత్వం విఫలమైందా?**

జ: ప్రభుత్వం విఫలమైందని మీరు చెప్పలేరు. కానీ విద్యార్థులకు న్యాయం ఎలా చేయాలో అనే అంశంపైనే మనం దృష్టి పెట్టాలి. పునఃమూల్యాంకనం నుంచి పునఃమదింపు వరకు ఎన్నో చర్యలు తీసుకున్నాము. ఇప్పుడు పోర్టల్స్ ఏర్పాటు చేశాం. చాలా మంది విద్యార్థులు తమ పేర్లను నమోదు చేసుకుని, సందేహాలను పంపారు. సైబర్ దాడులు జరిగినప్పటికీ, వాటిని సరిదిద్దడానికి ప్రభుత్వం అవసరమైన చర్యలు తీసుకుంది. భవిష్యత్తులో ఇటువంటి అక్రమాలు జరగకుండా వ్యవస్థను పారదర్శకంగా మార్చడమే మా ప్రాథమిక లక్ష్యం. మనమంతా కలిసి కూర్చుని సంస్కరణలు జరిగేలా చూస్తే విద్యార్థుల భవిష్యత్తు బాగుంటుంది.

**ఈ వైఫల్యానికి ప్రభుత్వంలో ఎవరో ఒకరు బాధ్యత వహించాలని మీరు అనుకోవడం లేదా?**

జ: మొదటగా, వ్యవస్థను దెబ్బతీయడానికి ఏ స్థాయిలోనైనా ఎవరైనా ఉద్దేశపూర్వకంగా ప్రయత్నించి ఉంటే, వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి. విద్యార్థుల్లో నమ్మకాన్ని పెంపొందించేందుకు సీబీఎస్ఈ చైర్మన్, సెక్రటరీలను బదిలీ చేశాం. వ్యవస్థను మార్చేందుకు కొత్త ప్రతిపాదనలు సిద్ధంగా ఉన్నాయి. ఈ పొరపాటుకు తానే నైతిక బాధ్యత వహిస్తానని విద్యాశాఖ మంత్రి ఇప్పటికే ప్రకటించారు. ఆయన బాధ్యత నుంచి పారిపోవడం లేదు, దానికి బదులుగా సమస్యను పరిష్కరించడాన్ని ఒక సవాలుగా తీసుకున్నారు. విద్యా మంత్రి రాజీనామా చేయాలనే డిమాండ్ కేవలం విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యల నుంచి రాజకీయ ప్రయోజనం పొందే ప్రయత్నం మాత్రమే.

**ఒకవేళ బిజెపి ప్రతిపక్షంలో ఉండి ఉంటే మీరు విద్యా మంత్రి రాజీనామాను డిమాండ్ చేసేవారు కాదా?**

జ: దానికి దీనికి చాలా తేడా ఉంది. అవినీతి లేదా అక్రమాలు మంత్రి లేదా మంత్రి సిబ్బంది ద్వారా జరిగితే, దానికి మంత్రి బాధ్యత వహిస్తారు. కానీ ఒక స్వయంప్రతిపత్తి కలిగిన సంస్థ లోపల సమస్య తలెత్తితే, దానికి ఆ సంస్థలే సమాధానం చెప్పుకోవాలి. సీబీఎస్ఈ అనేది ఒక స్వయంప్రతిపత్తి కలిగిన సంస్థ. అలాగే జాతీయ పరీక్షల నిర్వహణ సంస్థ (ఎన్టీయే ) కూడా ఉంది, వీటిని ప్రతిరోజూ మంత్రి నేరుగా పర్యవేక్షించరు. మేము ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ప్రతి నెలా మంత్రులపై అవినీతి ఆరోపణలు వచ్చేవి. గత 12 ఏళ్లలో లంచాలు తీసుకున్నారని లేదా కమీషన్లు తీసుకున్నారని, వ్యవస్థను దుర్వినియోగం చేశారని ఏ మంత్రిపైనా ప్రత్యక్ష ఆరోపణలు రాలేదు... కాబట్టి, కాంగ్రెస్ ఏం చేసింది, మేం ఏం చేశాం అనే తేడాను గుర్తించండి.

**మైనారిటీల ప్రయోజనాల కోసం మన్మోహన్ సింగ్ 15 సూత్రాల కార్యక్రమాన్ని ప్రారంభించారు, 2014-15లో అన్ని కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాలలో 8.71 శాతం మైనారిటీలు నియమితులయ్యారు. 2014-15 తర్వాత ఇప్పటివరకు కేంద్ర ప్రభుత్వంలో ఎంత శాతం మైనారిటీలు నియమితులయ్యారు?**

జ: నేను కేవలం కొన్ని సంస్థల్లో నియామకాలను మాత్రమే చూడను. మొత్తంగా పరిశీలించండి. మోదీ ప్రధాని అయిన 12 ఏళ్ల తర్వాత భారతదేశంలో మైనారిటీల పరిస్థితి ఎంతో మెరుగ్గా ఉంది. మైనారిటీలు సురక్షితంగా లేరంటూ పదేపదే నినాదాలు చేయడం కాంగ్రెస్, వామపక్ష సంస్థలకు అలవాటుగా మార్చుకుంది. 'సబ్కా సాత్, సబ్కా వికాస్' అంటే ప్రతి పథకం అందరి కోసమే అని అర్థం. మతపరమైన వేధింపుల వల్ల భారతదేశాన్ని విడిచిపెట్టి వెళ్లిన ఒక్క వ్యక్తి పేరైనా ఎవరైనా చెప్పగలరా? భారతదేశంలో ముస్లింలు సురక్షితంగా లేరని చెప్పడం ద్వారా కొందరు దేశ ప్రతిష్టను దిగజార్చుతున్నారు. ఆఫ్ఘనిస్తాన్ నుంచి హిందువులు, సిక్కులు భారతదేశానికి వచ్చారు, పాకిస్తాన్ నుంచి కూడా వచ్చారు.

1959లో టిబెట్‌లో సమస్యలు మొదలైనప్పుడు, వారు (టిబెటన్లు) భారతదేశానికి ఎందుకు వచ్చారు? భారతదేశం అందరినీ కలుపుకొనిపోతుందని ఇది నిరూపిస్తోంది. ఇది కేవలం బిజెపి వల్ల మాత్రమే కాదు, భారతీయ సమాజం నైజమే అటువంటిది. కానీ అక్రమ వలసదారులను మేము అంగీకరించబోమని చాలా స్పష్టంగా చెప్పాం. మన దేశంలో సమస్యలు సృష్టించే ఎవరినీ మేము సహించం. నియామకాల విషయానికొస్తే, అర్హులైన వ్యక్తులు ఎక్కడున్నా వారికి నియామకాలు జరుగుతాయి. మేము ఎవరినీ సంతోషపెట్టేందుకు ప్రయత్నించం. మా సిద్ధాంతం చాలా సులభం—అందరికీ న్యాయం, ఎవరిపట్లా ప్రత్యేక పక్షపాతం లేదు. ఏ సంస్థలోనైనా ఎవరికైనా నియామకం దక్కకుండా ఉద్దేశపూర్వకంగా అడ్డుకునే ప్రయత్నమేదీ జరగడం లేదు.

**ఫిబ్రవరిలో, క్యాథలిక్ బిషప్స్ కాన్ఫరెన్స్ ఆఫ్ ఇండియా క్రైస్తవులపై, ముఖ్యంగా ప్రార్థనల సమయంలో జరుగుతున్న దాడుల గురించి ప్రధానికి లేఖ రాసింది, కానీ ఏమీ జరగలేదు. అలాగే, విదేశీ విరాళాల నియంత్రణ చట్టం కింద ఇప్పటివరకు 20,000కు పైగా సంస్థలు తమ లైసెన్స్‌లను కోల్పోవడంపై మీ స్పందన ఏమిటి?**

జ: మొదటిగా, మైనారిటీ వర్గాల సంక్షేమాన్ని చూసే బాధ్యత నాపై ఉంది, కానీ శాంతిభద్రతలు మైనారిటీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ పరిధిలోని అంశం కాదు. ఒక ఉదాహరణ చెప్పాలంటే, 2015 దిల్లీ ఎన్నికలకు ముందు, దిల్లీలో చర్చిలపై దాడులు జరిగాయని వార్తలు వచ్చాయి. నేను దిల్లీ పోలీస్ కమిషనర్‌ను పిలిపించి గణాంకాలు అడిగాను; అక్కడ నాలుగు సంఘటనలు జరిగాయి. నేను మూడు నెలల కాలంలో జరిగిన సంఘటనల వివరాలు అడిగాను. దేవాలయాలకు సంబంధించి 300 కంటే ఎక్కువ, గురుద్వారాలకు సంబంధించి సుమారు 150, మసీదులకు సంబంధించి దాదాపు 100 సంఘటనలు జరిగాయి. కానీ వార్తలు మాత్రం కేవలం చర్చిలపై దాడుల గురించే వచ్చాయి. ఆ తర్వాత దిల్లీ ఎన్నికలు ముగిసిన వెంటనే ఆ వార్తలు ఆగిపోయాయి. ఒక లౌకిక దేశంలో ఇలాంటి ప్రచారాలు చేయడం తగునా? చర్చిల విషయంలో సంఘటనలు జరిగితే, కాశ్మీర్, అస్సాం, బెంగాల్, కర్ణాటక వంటి చోట్ల హిందువులపై కూడా దాడులు జరుగుతున్నాయి... అది ఎక్కడైనా జరగవచ్చు. ఒక సంఘటన జరిగినంత మాత్రాన అది జాతీయ సమస్య అయిపోదు. ఇక విదేశీ విరాళాల చట్టం విషయానికొస్తే, దీనివల్ల కేరళలో బిజెపికి ఐదు శాతానికి పైగా ఓట్లు తగ్గాయని ఎవరో అన్నారు. మేము ఓట్ల కోసం ఏమీ చేయడం లేదు. ఈ

చట్టానికి సంబంధించి ఒక ప్రధాన సవరణను 2010లోనే యూపీఏ ప్రభుత్వం చేసింది. ఇది అప్పటికే అమలులో ఉంది.

**కానీ మీరు ఎన్నికలకు ఏడు రోజుల ముందు ఈ పని చేశారు కదా.**

జ: లేదు, అమలు ప్రక్రియ నిరంతరం కొనసాగుతూనే ఉంది. గత 12 ఏళ్లలో 20,000కి పైగా FCRA లైసెన్స్‌లు రద్దయ్యాయి... ఎన్నో రద్దులు జరిగాయి కానీ అప్పీలు చేసుకోవడానికి అవకాశాలు కల్పిస్తున్నాము. ఒకవేళ రద్దు ఏకపక్షంగా అనిపించినా, లేదా వారి వాదనను వినిపించడానికి తగినంత సమయం ఇవ్వకపోతే, అది సంబంధిత న్యాయ సూత్రాలను ఉల్లంఘించినట్లు అవుతుంది. దాన్ని పరిశీలిస్తాం. కానీ ఇది ఎవరినీ లక్ష్యంగా చేసుకుని చేసింది కాదు. ఇది ఏ ఒక్క మత సమూహానికి ఉద్దేశించిన చట్టం కాదు. ఇది అందరికీ వర్తించే చట్టం. క్రైస్తవ సమాజం నుంచి ఏదైనా ఫిర్యాదు వస్తే మేము కచ్చితంగా పరిష్కరిస్తాం, కానీ మిషనరీలను మాత్రమే లక్ష్యంగా చేసుకుని ఈ కార్యక్రమం జరుగుతోందని అనడం తప్పు.

**లోక్‌సభ స్థానాలను 543 నుంచి 816కి, అంటే దాదాపు 272 స్థానాలను పెంచాలని ప్రభుత్వం ప్రతిపాదించింది. దీనివల్ల ప్రభుత్వంపై, ప్రజలపై పడే ఆర్థిక భారం ఎంత ఉంటుందో చెప్పగలరా? రెండోది, మహిళలకు రిజర్వేషన్లు ఇవ్వాలని ప్రభుత్వం నిజంగా భావిస్తే ప్రస్తుతం ఉన్న సీట్ల సంఖ్యతోనే రిజర్వేషన్లు ఇవ్వడానికి మిమ్మల్ని అడ్డుకుంటున్నది ఏమిటి?**

జ: దాదాపు 80 శాతం రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలలో ఎంపీల కంటే ఎమ్మెల్యేల జీతాలు ఎక్కువగా ఉన్నాయి. ఎన్నికైన సభ్యుల జీతభత్యాలు, ఇతర వసతుల భారం రాష్ట్ర ఖజానాపై పడుతుంది. ఎదుగుతున్న దేశంగా భారతదేశానికి ఈ బాధ్యతను నిర్వహించడంలో ఎలాంటి ఇబ్బందులు ఉండవు. కచ్చితంగా చిన్న రాష్ట్రాలపై ఎక్కువ భారం పడుతుంది, కానీ పెద్ద రాష్ట్రాలకు ఇది పెద్ద సమస్య కాదు, ఎందుకంటే జీతాల పరంగా కొన్ని కోట్లు మాత్రమే ఖర్చవుతుంది. ఒక ఎంపీ జీతం కేవలం ఒక లక్ష రూపాయలు మాత్రమే. మంత్రిగా నాకు జీతం రాదు, కాబట్టి పెద్దగా భారం ఏమీ లేదు. మొత్తం సభ్యుల సంఖ్య పెరగడం ఎందుకు అవసరమనే విషయానికొస్తే, ఉత్తరప్రదేశ్ వంటి ప్రాంతాలలో ఒక ఎమ్మెల్యే దాదాపు నాలుగు లక్షల మంది ప్రజలకు ప్రాతినిధ్యం వహిస్తున్నారు, ఇది యూరప్‌లోని 20 మంది ఎంపీలతో సమానం. ఎన్నికైన ప్రతినిధి మొత్తం ప్రాంతాన్ని తిరగలేకపోతే లేదా ప్రజలను కలవలేకపోతే, అది ఒక లోపంగా మారుతుంది, దాన్ని సరిదిద్దాలి. నిజానికి, మీకు ప్రజాస్వామ్యంపై అంత ఆందోళన ఉంటే, కేవలం 850 సీట్లు మాత్రమే ఎందుకు అని మీరు ప్రశ్నించాలి.

**'కాక్రోచ్ జనతా పార్టీ' నిర్వహిస్తున్న నిరసనలపై మీ అభిప్రాయం ఏమిటి?**

జ: రాజకీయ పార్టీని ఎవరైనా స్థాపించవచ్చు. కానీ భారత ప్రజాస్వామ్యాన్ని తక్కువ చేసి చూపించవద్దు, హేళన చేయవద్దు. సిజేపీ కేవలం కాంగ్రెస్ పార్టీకి మాత్రమే సవాలు విసురుతోంది. ఆందోళన చెందాల్సింది వారే.

**దేశంలో కాంగ్రెస్‌కు మూడు రాష్ట్రాల్లో ప్రభుత్వాలు ఉన్నాయి, లెఫ్ట్ పార్టీలకు ఎక్కడా లేదు. మరి అధికారంలో ఉన్న 12వ ఏట బిజెపికి ఇది ఇంత పెద్ద సవాలుగా ఎలా మారుతోంది?**

జ: భారత ప్రజలు తమ వాదనలను కానీ, తమ నాయకత్వాన్ని కానీ అంగీకరించడం లేదనే విషయాన్ని కాంగ్రెస్, లెఫ్ట్ పార్టీలు అర్థం చేసుకోవాలి. అయినప్పటికీ మోదీ విఫలమయ్యారని, బిజెపి విఫలమైందని వారు అంటున్నారు. ప్రభుత్వం విఫలమైందనే ఈ ప్రచారాన్ని వారు ఇకనైనా ఆపాలి. ప్రజలు ప్రభుత్వాన్ని ఆమోదించారు... వారు పేపర్లలో, సోషల్ మీడియాలో బలంగా ఉండవచ్చు, కానీ మేము వారిని తిప్పికొడుతున్నాము.

**కానీ ప్రజాస్వామ్యంలో ప్రతిపక్షానికి స్థానం లేదా?**

జ: ప్రజలే వారిని తిరస్కరిస్తే, దానికి మమ్మల్ని ఎలా నిందిస్తారు?

**గత కొన్నేళ్లుగా పార్లమెంటులో ఉత్పాదకత ఎక్కువగా ఉన్నప్పటికీ, కమిటీలకు వెళ్లే బిల్లుల సంఖ్య తగ్గడాన్ని, అతి తక్కువ సమయంలోనే ఎక్కువ బిల్లులు ఆమోదం పొందడాన్ని చూస్తున్నాం. ఇది ఆందోళన కలిగించే విషయమేనా, దీన్ని మీరు ఎలా పరిష్కరిస్తారు?**

జ: కొన్ని విషయాల్లో మీరు చెప్పింది నిజమే. గత కొన్ని సంవత్సరాలలో ఆమోదించిన బిల్లుల సంఖ్య తక్కువేమీ కాదు, కానీ చర్చకు ఇచ్చిన సమయం తక్కువ. ఎందుకంటే సమావేశాలు ప్రారంభమైనప్పటి నుంచి కాంగ్రెస్ పార్టీ సభా నిబంధనలను ఉల్లంఘించి సభావేదిక లోకి దూసుకువచ్చి 'మీ ప్రధాని దొంగ' అంటూ నినాదాలు చేయడం ప్రారంభిస్తుంది.

# మోర్చాల జిల్లా అధ్యక్షులు వీరే!

| జిల్లా | కిసాన్ మోర్చా | ఎస్టీ మోర్చా | మహిళా మోర్చా |
|---|---|---|---|
| ఆదిలాబాద్ | కటకం రాందాస్ | ఆత్రం సాయి కృష్ణ | సుమన్ జాదవ్ |
| మంచిర్యాల | గోపినాథ్ రాజయ్య | ప్రేంసింగ్ రాథోడ్ | పాచ స్వప్న రాణి |
| నిర్మల్ | జక్కుల సత్తయ్య యాదవ్ | పండిట్ జాదవ్ | బి. సత్యవతి |
| కొమరంభీం ఆసిఫాబాద్ | వొడ్డేటి నానయ్య | సందీప్ రాథోడ్ | నారా వనజ |
| నిజామాబాద్ | తిరుపతి రెడ్డి | నేనావత్ ఓంసింగ్ | మారెడ్డి వనిత |
| కామారెడ్డి | సెహెరుబద్దం తిరుపతి రెడ్డి | ఆనంద్ కుమార్ జాదవ్ | పావని గౌడ్ |
| కరీంనగర్ | మోతె గంగారెడ్డి | రమావత్ శ్రీనివాస్ నాయక్ | జి. నిర్మలా దేవి |
| జగిత్యాల | బద్దం తిరుపతి రెడ్డి | బనావత్ తిరుపతి నాయక్ | దురిశెట్టి మమత |
| రాజన్న సిరిసిల్ల | అన్నాడి జలపతి రెడ్డి | మాలోత్ సాయి కిరణ్ నాయక్ | పల్లం అన్నపూర్ణ |
| సంగారెడ్డి | ఎం. రాజేందర్ రెడ్డి | వడిత్యా సుభాష్ జాదవ్ | మీనా గౌడ్ |
| మెదక్ | బైండ్ల సత్యనారాయణ | లావుడ్యా రాములు నాయక్ | పి. మల్లిక |
| సిద్దిపేట | రజనీకర్ రెడ్డి | మోహన్ నాయక్ | బొమ్మగోని పద్మ |

దీనివల్ల బిల్లులు బలిపశువులవుతున్నాయి. చర్చలకే అనుమతించనప్పుడు బిల్లులను ఎలా పరిశీలిస్తారు? మొదటిగా, వారు వాదోపవాదాలకు, చర్చలకు అనుమతించాలి. ఆ సమయంలో అవసరమైతే బిల్లులను పార్లమెంటరీ స్థాయీ సంఘం లేదా జేపీసీకి పంపుతారు. అది సభ నిర్ణయించాల్సి ఉంటుంది. కానీ సభ ప్రారంభమైన వెంటనే ఎంపీలు ప్లకార్డులతో రావడంతో సభ మళ్లీ వాయిదా పడుతోంది.

**ఎన్డీయే ప్రభుత్వం 13వ ఏడాదిలోకి అడుగుపెడుతోంది. పాలన విషయానికొస్తే, మీ నిజమైన సవాళ్ళేమిటి?**

జ: ప్రస్తుతానికైతే పశ్చిమాసియా సంక్షోభం. మనకు కావలసిన చమురు, గ్యాస్‌లో 80 శాతం హోర్ముజ్ జలసంధి ద్వారానే వస్తుందనేది వాస్తవం. మనం మన ఇంధన వనరులను వైవిధ్యభరితం చేసుకున్నామని ప్రధాని ఇప్పటికే లోక్‌సభ, రాజ్యసభలలో స్పష్టం చేశారు. హరిత, స్వచ్ఛ ఇంధనం వైపు మారడానికి మేము అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నాం. పశ్చిమాసియా సంక్షోభం కారణంగా ప్రభుత్వంపై భారీ భారం పడింది. ఎక్సైజ్ సుంకాన్ని 10 రూపాయలు తగ్గించడం వల్ల మాకు రూ.1 లక్ష కోట్లకు పైగా నష్టం వాటిల్లింది. చమురు ధరల పెరుగుదల కేవలం ఐదు శాతం లోపే ఉన్న అతికొద్ది దేశాలలో భారతదేశం ఒకటి. అయినప్పటికీ, ప్రతిపక్ష పార్టీలు రచ్చ చేస్తూనే ఉన్నాయి. ఇటువంటి సంక్షోభ సమయంలో ప్రతి ఒక్కరూ ప్రభుత్వానికి మద్దతుగా నిలవాలి. బాహ్య లేదా అంతర్గత సంక్షోభం ఏర్పడినప్పుడు ప్రజలు ప్రభుత్వానికి అండగా నిలవడం ఎప్పటి నుంచో వస్తున్న ఆచారం.

**మరి యువత ఆకాంక్షల సంగతి ఏమిటి? యువతలో అసంతృప్తి పెరుగుతుండటం మనం చూస్తున్నాం. అది మిమ్మల్ని ఆందోళనకు గురిచేయడం లేదా?**

జ: యువత ఆకాంక్షలు కచ్చితంగా పెరిగాయి. భారతదేశంలోని యువతకు తమ అవసరాలు, హక్కులపై మరింత అవగాహన వచ్చింది. కానీ వాటితో పాటు, దేశం పట్ల తమకున్న బాధ్యతలు, విధులను కూడా వారు గుర్తించాలి. యువత దేశానికి అతిపెద్ద ఆస్తి, భారత్ వృద్ధికి వారి భాగస్వామ్యం ఎంతో అవసరం.■

| | | | |
|---|---|---|---|
| రంగారెడ్డి అర్బన్ | గుజ్జ మధుసూదన్ రెడ్డి | గుగులోతు విజేందర్ సింగ్ | పద్మ కసిరెడ్డి |
| రంగారెడ్డి రూరల్ | టేకుల రాంరెడ్డి | విస్లావత్ మోహన్ సింగ్ | పడమటి మమతా రెడ్డి |
| మేడ్చల్ అర్బన్ | అన్నబోయిన మల్లేష్ యాదవ్ | వెంకటేష్ నాయక్ | – |
| మేడ్చల్ రూరల్ | ఈ. అంజిరెడ్డి | లావుడ్య రాము నాయక్ | సంధ్యా రెడ్డి |
| నల్గొండ | గడ్డం వెంకట్ రెడ్డి | నేనావత్ వినోద్ రాథోడ్ | రావిళ్ళ కాశమ్మ |
| సూర్యాపేట | కంచర్ల నర్సింహా రెడ్డి | మాలోత్ సంక్రు నాయక్ | సీతా నాయక్ |
| యాదాద్రి భువనగిరి | పక్కిర్ రాజేందర్ రెడ్డి | కిషన్ నాయక్ | మాధురి చంద్ర |
| మహబూబ్ నగర్ | దాబ శ్రీనివాస్ రెడ్డి | అంగోత్ గోవింద్ నాయక్ | బి. సాహితీ రెడ్డి |
| వనపర్తి | రాకాసి అర్వింద్ రెడ్డి | కేతావత్ రవి నాయక్ | జి. కవిత |
| నాగర్ కర్నూల్ | శ్రీసనగండ్ల చంద్రా రెడ్డి | రవీందర్ చౌహాన్ | ఎం. పద్మ యాదవ్ |
| జోగులాంబ గద్వాల | కిష్టన్న కుర్వ | ఎస్.వై. పవన్ కళ్యాణ్ | ఎస్. సమత |
| నారాయణపేట | వెంకట రాములు ముదిరాజ్ | పాండు నాయక్ | కె. విమల జాదవ్ |
| హన్మకొండ | డి. యాదగిరి రావు | – | రత్న లక్ష్మి |
| వరంగల్ | కిషన్ దండు | బానోత్ రమేష్ | టేకుమట్ల రేణుక |
| జయశంకర్ భూపాలపల్లి | పోలసాని తిరుపతి రావు | అజ్మీరా రాజు నాయక్ | బూర పద్మ |
| జనగాం | సోమిడి వెంకట్ రెడ్డి | రవి నాయక్ | జీవన జ్యోతి |
| మహబూబాబాద్ | నల్లని పాపారావు | గుగులోతు సురేష్ | గద్దల సరోజ |
| ములుగు | రామరాజు జాడి | సిద్దబోయిన సురేందర్ | కొర్ర సుమలత |
| ఖమ్మం | నరుకుల వెంకటేశ్వర్లు | తాజనోత్ భద్రం నాయక్ | మంద సరస్వతి |
| భద్రాద్రి కొత్తగూడెం | గొట్టిపొల్ల దుర్గా శ్రీనివాస్ | భూక్య స్వాతి | సముద్రాల గాయత్రి |
| గోల్కొండ గోషామహల్ | మాణిక్ ప్రభు రావుల | జగపతి నాయక్ | డా. సురేఖ |
| భాగ్యనగర్–మలక్ పేట్ | ఎం. లక్ష్మారెడ్డి | విస్లావత్ గోపి నాయక్ | మంజులా రెడ్డి |
| మహంకాళి సికింద్రాబాద్ | కన్నాభిరాం | సోమ్లా సాయి రాథోడ్ | – |
| హైదరాబాద్ సెంట్రల్ | ఎం. రాఘవ రెడ్డి | భూక్య దీపికా రాథోడ్ | – |



జూన్ 21న నారాయణపేట పర్యటనలో స్థానిక నాయకులు, కార్యకర్తలతో చాయ్ పే చర్చాలో పాల్గొన్న రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు




ఒడిశా పహార్పూర్ అభివృద్ధి కార్యక్రమాల్లో భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ప్రధాని నరేంద్ర మోదీ



జూన్ 21న అంతర్జాతీయ యోగా దినోత్సవంలో భాగంగా యోగసనాలు చేసిన బిజెపి నాయకులు

Declaration No. K1852/SB/81/2005 R.N.I No.52721/91




G7 శిఖరాగ్ర సదస్సులో ప్రపంచ నేతలతో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ

**Editor & Publisher:** MANTHRI SRINIVASULU on behalf of Bharateeya Janata Party, Dr Shyam Prasad Mukharji Bhavan, Opp: Ex– hibition Grounds, Nampally, Hyderabad–500 001.